జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం

**WANTED**
గత 15 సంవత్సరాలుగా ప్రజల మన్ననలు పొందుతూ ప్రజల సమస్యలే ధ్యేయంగా పోరాడుతున్న "ప్రజాజ్యోతి" జాతీయ దినపత్రికకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా జిల్లా స్టాఫ్ రిపోర్టర్, నియోజకవర్గ ఇంఛార్జీలు మరియు మండల రిపోర్టర్లు కావలెను.
అనుభవం కలిగిన రిపోర్టర్లు మరియు చక్కటి వార్తలు రాయగలిగే కొత్తవారికి కూడా అవకాశం కల్పించబడును.
ప్రజాజ్యోతి
సంప్రదించవలసిన నెంబర్లు
9440231967, 7989894528

రంగారెడ్డి | శనివారం 25 ఏప్రిల్ 2026 | సంపుటి : 16 | సంచిక : 271 | వెల: రూ.5 | పేజీలు: 08 | RNI NO.APTEL/2010/36516

విక్రం సంవత్సరం - పింగళ 2081, ఆషాఢము 3 ఇండియన్ సివిల్ క్యాలెండర్ - 1946, ఆషాఢము 17 పుర్నిమంతా - 2081, ఆషాఢము 16 అమాంత - 2081, ఆషాఢము 3 తిథి శుక్లపక్షం తదియ నక్షత్రం పుష్యమి

Published from RANGAREDDY, WARANGAL, KAMMAM, NALAGONDA http://www.prajajyothinews.com Mail: prajajyothidaily@gmail.com



## బంగాల్ తొలిదశ ఎన్నికల్లో బీజేపీకి 110 సీట్లు

- బంగాలీ మాట్లాడే వ్యక్తికే సీఎం బాధ్యతలు: అమిత్ షా
- తొలి దశ పోలింగ్‌లోనే 110కిపైగా స్థానాలు గెలుస్తామని అంచనా
- మే 5 తర్వాత బంగాల్‌లో బీజేపీ ప్రభుత్వం ఏర్పడుతుందన్న విశ్వాసం
- భయం నుంచి భరోసా దిశగా ఓటర్ల ప్రయాణం ప్రారంభమైందని వ్యాఖ్య



## డిసెంబర్ నుంచి అడ్డంకులు లేని టోలింగ్ వ్యవస్థ

- లాజిస్టిక్స్ ఖర్చును తగ్గించడానికి భారత్ మంచి మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయాల్సి ఉంటుందని వెల్లడి
- నిబంధనలను పాటించని పక్షంలో ఉల్లంఘించిన వారికి ఇ-నోటీసులు జారీ

# డిపోలకే పరిమితమైన
# ప్రగతి చక్రాలు



- అద్దె బస్సులతో ప్రయాణికుల అవస్థలు
- డిమాండ్లు పరిష్కరించే దాకా తగ్గేదే లే అంటున్న ఆర్టీసీ కార్మికులు
- డిపోలకే పరిమితమైన బస్సులు
- సమ్మె కారణంగా ప్రయాణికులకు తప్పని అవస్థలు

హైదరాబాద్

ఆర్టీసీ సమ్మె ప్రయాణికులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తుంది. పరిమిత సంఖ్యలో మాత్రమే బస్సులు నడుస్తుండటంతో వాహన రాకపోకలు పూర్తి సామర్థ్యంతో సాగడం లేదు. ఆర్టీసీ బస్సులు రెండో రోజు కూడా డిపోలకే పరిమితమయ్యాయి. కొన్ని రూట్లలో అద్దె బస్సులు మాత్రం రోడ్డెక్కాయి. రోజూవారీ వేతన ప్రాతిపదికన తాత్కాలికంగా డ్రైవర్లు, కండక్టర్లను నియమించి, బస్సులను నడిపిస్తున్నారు. ఆర్టీసీ యూనియన్ ఆధ్వర్యంలో కార్మికులు గురువారం డిపోల ఎదుట బైఠాయింపు నిరసన చేపట్టారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఆదిలాబాద్? జిల్లాలో తీవ్రమైన ఎండను సైతం లెక్కచేయకుండా ఆర్టీసీ బస్ స్టాండ్ నుంచి కుమురం భీం జంక్షన్ వరకు ర్యాలీ నిర్వహించారు. మొదటి రోజుతో పోలిస్తే రెండో రోజు గణనీయంగా ఎక్కువ సంఖ్యలో బస్సులు నడిచాయి. ఆసిఫాబాద్, నిర్మల్, ఉట్నూర్, పాండరకవాడ, బోథ్, బేల - మిగతా3లో



### ఆర్టీసీ విషయంలో బీఆర్ఎస్, కాంగ్రెస్..
# దొందూ దొందే

- బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలు అన్యాయమే చేశాయి
- కార్మికుల కోసమే శంకర్ బలిదానం అయ్యాడు
- ఇది ముమ్మాటికీ ప్రభుత్వం చేసిన హత్యే
- కాంగ్రెస్ ప్రభుత్వం బెదిరింపులకు దిగడం సరికాదు
- కాంగ్రెస్‌ది అభయ హస్తం కాదు.. భస్మాసుర హస్తం

కరీంనగర్

కాంగ్రెస్ ప్రభుత్వ మొండి వైఖరి వల్లే ఆర్టీసీ డ్రైవర్ శంకర్ గౌడ్ ఆత్మహత్య చేసుకున్నాడని బీజేపీ నేత, కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. ఆర్టీసీ కార్మికుల విషయం లో బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలు అన్యాయమే చేశాయని విమర్శించారాయన. కార్మికుల కోసమే శంకర్ బలిదానం అయ్యాడని.. ఇది ముమ్మాటికీ ప్రభుత్వం చేసిన హత్యేనని బండి సంజయ్ మండిపడ్డారు. - మిగతా3లో



## ఇరాన్‌కు ప్రారంభమైన విమాన సర్వీసులు

- భారతీయులకు కీలక సూచన జారీ చేసిన ఇండియన్ ఎంబసీ
- భూ మార్గం ద్వారాగానీ, వాయు మార్గం ద్వారాగానీ ఇరాన్ ప్రయాణించడం శ్రేయస్కరం కాదు

# తెలంగాణ ఐపీఎస్ అధికారుల బదిలీలు



- మల్కాజిగిరి సీపీగా బి.సుమతి
- హోం శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీగా శిఖా గోయల్
- మల్టీ జోన్-2 ఐజీపీగా నియమితులైన షాహ్నావాజ్ ఖాసిమకు పర్సనల్ ఐజీపీ అదనపు బాధ్యతలు
- సుధీర్ బాబు పదవీ విరమణ నేపథ్యంలో ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనర్‌గా తరుణ్ జోషి

హైదరాబాద్

తెలంగాణ ప్రభుత్వం మరోసారి ఐఏఎస్ లను భారీగా బదిలీ చేసింది. ఈమేరకు ఐపీఎస్ అధికారుల బదిలీలు, పోస్టింగ్స్ పై ఒక ప్రకటన జారీ చేసింది. ఈ ఏడాది మే 1 నుంచి ఈ నియామకాలు అమల్లోకి రానున్నాయి. తెలంగాణ ప్రభుత్వం శుక్రవారం ప్రకటించిన భారీ స్థాయి అధికారుల బదిలీల లో భాగంగా, డాక్టర్ తరుణ్ జోషి 'ఫ్యూచర్ సిటీ' పోలీస్ కమిషనర్‌గా నియమితుల య్యారు. అలాగే బి. సుమతి మల్కాజిగిరి పోలీస్ కమిషనర్‌గా - మిగతా3లో



### బంగాల్ తొలిదశ ఎన్నికల్లో
## రికార్డు స్థాయి ఓటింగ్

- హర్షం వ్యక్తం చేసిన సీజేఐ
- ఎస్ఐఆర్ తర్వాత ఓటరు జాబితాలో పేర్ల చేరిక కోసం విచారణ కోరేవారికి ప్రాధాన్యతనిస్తూ విచారణ చేపట్టాలి
- అప్పీలేట్ ట్రిబ్యునళ్లకు సుప్రీంకోర్టు ఆదేశం

2



## బీజేపీ చేరిన రాఘవ్ చడ్డా

- త్వరలో కేంద్ర మంత్రి పదవి దక్కే అవకాశం!
- 'ఆప్ పార్టీలోని 2/3వ వంతు ఎంపీలు బీజేపీలో చేరడానికి సిద్ధంగా ఉన్నారు'
- రాఘవ్ చడ్డా కీలక వ్యాఖ్యలు

# సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో ఉన్నాం

- మంత్రులతో జేఏసీ నేతల భేటీ
- శంకర్‌గౌడ్ కుటుంబానికి రూ.10 లక్షల సాయం, ఉద్యోగం ఇస్తామన్న పొన్నం
- మంత్రులతో ఆర్టీసీ ఉద్యోగ సంఘాల సమావేశం
- డ్రైవర్ శంకర్‌గౌడ్ మృతిపట్ల సంతాపం తెలిపిన మంత్రులు
- శంకర్‌గౌడ్ కుటుంబానికి రూ.10 లక్షల సాయం, ఉద్యోగం ఇచ్చేందుకు పొన్నం అంగీకారం



హైదరాబాద్

తెలంగాణలో ఆర్టీసీ కార్మికుల డిమాండ్ల పరిష్కారంలో భాగంగా ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధ్యక్షతన సచివాలయంలో ఆర్టీసీ జేఏసీ నేతలతో మంత్రుల బృందం సమావేశం తుదిదశకు చేరుకుంది. దశలవారీగా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సమ్మతించినట్లుగా తెలిసింది. అన్ని సమస్యలపై స్పష్టత ఇవ్వాలని జేఏసీ నేతలు పట్టుబట్టినట్లు సమాచారం. ఆర్టీసీ గుర్తింపు సంఘం ఎన్నికల నిర్వాహణకు సూత్రప్రాయంగా అంగీకారం తెలిపే అవకాశం ఉంది. పీఆర్సీ, డీఏపై ఆర్టీసీ కార్మికులకు స్పష్టత ఇవ్వనున్నట్లుగా తెలుస్తోంది. ప్రభుత్వంలో ఆర్టీసీ వీలినంపై మంత్రివర్గ - మిగతా3లో



## 'అకృత్యాల నుంచి ఆడబిడ్డలకు విముక్తి కల్పిస్తాం'

- బంగాల్ మహిళలకు ప్రధాని మోదీ హామీ?
- బంగాల్ మహిళా ఓటర్ల మద్దతు కోరిన ప్రధాని మోదీ
- "టీఎంసీ ఒక మహిళా వ్యతిరేక పార్టీ
- బీజేపీ మహిళా నేతృత్వంలోని అభివృద్ధి నమూనాపై పనిచేస్తుంది
- బీజేపీకి ఓటు వేస్తే ఆడబిడ్డలపై జరుగుతున్న అకృత్యాల నుంచి విముక్తి లభిస్తుందని వెల్లడి

# సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో ఉన్నాం



-మొదటిపేజీ తరువాయి
ఉపసంఘం ఏర్పాటు చేయనున్నట్లుగా సమాచారం. ఈ సమావేశంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, వివేక్, అడ్లూరి లక్ష్మణ్‌లు పాల్గొన్నారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ప్రత్యేక సీఎస్ వికాస్‌రాజ్‌లు హాజరయ్యారు. డ్రైవర్ శంకర్ గౌడ్ మృతిపై మంత్రులు ఆర్టీసీ జేఏసీ నేతలు సంతాపం ప్రకటించారు. అనంతరం జేఏసీ నేతల డిమాండ్లపై చర్చిస్తున్నారు.

**శంకర్ గౌడ్ కుటుంబానికి రూ.10లక్షల సాయం, ఉద్యోగం**

సమ్మె నేపథ్యంలో ఆత్మహత్యకు పాల్పడిన డ్రైవర్ శంకర్ గౌడ్ కుటుంబాన్ని ప్రభుత్వం అన్నివిధాలుగా ఆదుకుంటుందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. శంకర్ గౌడ్ కుటుంబంలో ఒకరికి ఉద్యోగం, రూ.10 లక్షల ఆర్థిక సాయంతో పాటు ఇందిరమ్మ ఇల్లు ఇస్తామని ప్రకటించారు. శంకర్ గౌడ్ అంత్యక్రియలు పూర్తయ్యేవిధంగా ఆర్టీసీ జేఏసీ నేతలు చొరవ తీసుకోవాలని పొన్నం ప్రభాకర్ కోరారు. ఆపత్కాలంలో రాజకీయాలు చేయవద్దని విపక్షాలకు ఆయన సూచించారు. అంతకుముందు ఆర్టీసీ జేఏసీ నేతలు సీనియర్ ఐఏఎస్ అధికారుల కమిటీతో భేటీ అయ్యి తమ డిమాండ్లను తెలిపారు. ఆర్టీసీ ఉద్యోగ సంఘాలతో సీనియర్ ఐఏఎస్ కమిటీ సుదీర్ఘంగా సమావేశమైంది. మధ్యాహ్నం లంచ్ బ్రేక్ తరువాత మరోసారి భేటీ అయ్యారు. ఆ తరువాతే వారు డిప్యూటీ సీఎం భట్టి, మంత్రుల బృందాన్ని కలిశారు.

**32 డిమాండ్లు ప్రభుత్వం ముందు ఉంచిన నేతలు**

రాష్ట్ర సచివాలయంలో మంత్రులు, ఆర్టీసీ జేఏసీ నేతల మధ్య చర్చలు కొనసాగుతున్నాయి. ఆర్టీసీ జేఏసీ నేతలు మొత్తం 32 డిమాండ్లను మంత్రుల ముందు ఉంచారు. 29 డిమాండ్లపై మంత్రుల బృందం సానుకూలంగా స్పందించింది. ఇప్పటికే 29 డిమాండ్లపై సానుకూలంగా ఉన్నామని పొన్నం ప్రభాకర్ ప్రకటించారు. మూడు కీలక డిమాండ్లపై మంత్రులు, జేఏసీ నేతలు చర్చిస్తున్నారు. ప్రభుత్వంలో విలీనం, కార్మిక సంఘాల గుర్తింపు, పీఆర్‌సీపై చర్చలు కొనసాగుతున్నాయి.

**డ్రైవర్ శంకర్ మృతి బాధాకరం**

ఆర్టీసీ డ్రైవర్ శంకర్‌గౌడ్ మృతి చాలా బాధాకరమని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. ఇలాంటి విషాదకర సంఘటనలు పునరావృతం కాకుండా కార్మికులకు పిలుపునిద్దామని తెలిపారు. కూర్చుని మాట్లాడుకుంటే ఖచ్చితంగా పరిష్కారం లభిస్తుందన్నారు. రాష్ట్ర సచివాలయం లో ఆర్టీసీ జేఏసీ నేతలతో జరిగిన చర్చల సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆర్టీసీ అనేది మన రాష్ట్రంలోని అతిపెద్ద ప్రభుత్వ రంగ సంస్థ అన్నారు.

మన సంస్థను మనం బలోపేతం చేసుకోవాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఆర్టీసీ చిన్నాభిన్నమైందన్న భట్టి విక్రమార్క అప్పటి పాలకులు ఎంత కఠినంగా ప్రవర్తించారో మీరందరూ చూశారని వివరించారు. గత పాలకుల మాదిరిగా తాము వ్యవహరించబోమని స్పష్టం చేశారు. ఆర్టీసీకి సంబంధించిన పాలనాపరమైన, విధానపరమైన నిర్ణయాలపై కచ్చితంగా చర్చిద్దామన్నారు. కార్మికుల సమస్యలను సానుకూల దృక్పథంతో పరిష్కరించుకుందామన్నారు. మరోవైపు ఆర్టీసీ కార్మికులు అధైర్యపడవద్దని, కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో చర్చలు జరుపుతోందని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఓ ప్రకటన విడుదల చేశారు. కార్మికులు ప్రజాస్వామ్య పద్ధతి లో నిరసనలు తెలుపుకోవాలని, ఆవేశంలో ఎలాంటి అఘాయిత్యాలకు పాల్పడవద్దని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. రాజకీయ పార్టీలు నిరసనలకు మద్దతు ఇవ్వడం వల్ల అభ్యంతరం లేదని, అయితే కార్మికులను రెచ్చగొట్టే వ్యాఖ్యలు సరికాదని హితవు పలికారు. రాజకీయ పార్టీల రెచ్చగొట్టే వ్యాఖ్యల వల్లే శంకర్? గౌడ్? లాంటి ఘటనలు జరుగుతున్నాయన్న పొన్నం, నేతలు సంయమనం పాటించాలని విజ్ఞప్తి చేశారు.

**శంకర్‌గౌడ్ కుటుంబానికి ఆర్థిక సాయం**

శంకర్‌గౌడ్ కుటుంబానికి ఆర్థిక సాయం చేసేందుకు ఆర్టీసీ జేఏసీ నేతలు నిర్ణయించారు. కార్మికుల వేతనం నుంచి రూ.300 లేదా రూ.200 ఇవ్వాలని భావిస్తున్నారు. ప్రతీ ఉద్యోగి రూ.300 లు ఇస్తే రూ.1.30 కోట్లు, రూ.200 లు ఇస్తే రూ.75 లక్షలు శంకర్‌గౌడ్ కుటుంబానికి ఇవ్వనున్నారు.

# అనవసర వివాదాలు...

**హైదరాబాద్ :** మనదేశంలో ఎన్నో రాష్ట్రాలు ఉన్నాయి. కేంద్ర పాలిత ప్రాంతాలు కూడా ఉన్నాయి. వీటన్నింటికీ లేని గొప్ప నేపథ్యం తెలంగాణ రాష్ట్రానికి ఉంది. ఎందుకంటే మిగతా రాష్ట్రాలు ఎటువంటి ఉద్యమ నేపథ్యం లేకుండా ఏర్పడ్డాయి. తెలంగాణ రాష్ట్రం మాత్రం ఉద్యమాలు చేస్తే.. ప్రాణాలను తృణప్రాయంగా వదిలేస్తే వచ్చింది. ఆందోళనలు, నిరవధిక నిరాహార దీక్షలు, మిలియన్ మార్చ్ లు, వంటా వార్పు లు.. ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నో చేస్తేనే తెలంగాణ సాకారమైంది. స్వీయ అస్తిత్వ కాంక్ష అనేది తెలంగాణ మట్టిలోనే ఉంది. అందుకే ఇక్కడ రాజకీయ చైతన్యం.. సామాజిక చైతన్యం.. ప్రజలలో ధిక్కారస్వభావం అధికంగా ఉంటాయి.. కాళోజి నారాయణరావు.. జయశంకర్.. పోటు కృష్ణమూర్తి.. ఇలా చెప్పుకుంటూ పోతే ఎంతోమంది ఉద్యమకారుల వారసత్వం తెలంగాణ లో ప్రతి ప్రాంతంలో కనిపిస్తూనే ఉంటుంది. తెలంగాణ ఉద్యమం ఏర్పడేందుకు ప్రధాన కారణం ఆంధ్ర పాలకుల దోపిడి.. వివక్ష.. వీటినుంచి తెలంగాణ తనను తాను కాపాడుకొనేందుకు అనేక రకాలుగా ఉద్యమాలు చేయాల్సి వచ్చింది. ప్రాణాలు కూడా కోల్పోవాల్సి వచ్చింది. చివరికి తెలంగాణ ఏర్పడిన తర్వాత ఇటువంటి వాతావరణం మళ్లీ కనిపిస్తుంటే ఇంతకంటే దారుణం మరొకటి ఏమి ఉంటుంది. నాడు తెలంగాణ ఉద్యమం తీవ్రంగా సాగుతున్నప్పుడు వైయస్ జగన్మోహన్ రెడ్డి రాకను తీవ్రంగా నిరసిస్తూ మహబూబాబాద్ లో తెలంగాణ ఉద్యమకారులు రాళ్ల దాడికి పాల్పడ్డారు. కానీ అటువంటి జగన్మోహన్ రెడ్డిని అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రగతి భవన్ కు తోడుకొని వచ్చారు. కాళేశ్వరం ఎత్తిపోతల పథకానికి ముఖ్యఅతిథిగా ఆహ్వానించారు. జగన్మోహన్ రెడ్డి ప్రమాణ స్వీకారానికి కెసిఆర్ హాజరయ్యారు. అప్పట్లో చంద్రబాబుకు రిటర్న్ గిఫ్ట్ పేరుతో జగన్మోహన్ రెడ్డికి కెసిఆర్ సహాయం చేసినట్టు వార్తలు వచ్చాయి. అంతేకాదు రాయలసీమ ను బంగారు తునక చేస్తానని.. తెలంగాణ నుంచి ఎంత నీటినైనా సరే ఇస్తానని కేసీఆర్ ప్రకటించారు.. అంతేకాదు పోతిరెడ్డిపాడు వెడల్పుకు సహకరించారు. ఇలా చెప్పుకుంటూ పోతే కేసీఆర్ జమానాలో ఆంధ్ర ప్రాంతానికి అనుకూలంగా చాలా జరిగాయి.. నాడు జాతీయ పార్టీ ఊహల్లో తేలియాడుతూ.. దేశానికి ప్రధాన మంత్రి కావాలని ఆరాటంలో కేసీఆర్ చాలా చేశారు. చివరికి తనే కామారెడ్డిలో ఓడిపోయారు.ఇప్పుడు ఇదే కేసీఆర్ సరికొత్త పల్లవి అందుకున్నారు.. నాడు తెలంగాణ ఉద్యమంలో తాను కరీంనగర్ ఉప ఎన్నికల్లో పోటీ చేస్తే.. తన మీద కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన జీవన్ రెడ్డిని ఇప్పుడు భారత రాష్ట్ర సమితిలో చేర్చుకున్నారు. ఆయనకు ఏకంగా పార్టీ ప్రధాన కార్యదర్శి పదవి ఇచ్చారు. అంతేకాదు ఆయనను గొప్ప నాయకుడిగా పేర్కొన్నారు. నాడు ఇదే ఎన్నికల్లో తనకు వైయస్ రాజశేఖర్ రెడ్డి మాత్రమే ముఖ్యమని.. తెలంగాణ ఉద్యమంతో ఏం సంబంధం అని జీవన్ రెడ్డి వ్యాఖ్యానించారు. ఇప్పుడు తరచూ చంద్రబాబును.. రేవంత్ రెడ్డిని ఇష్టానుసారంగా తిట్టే కేసీఆర్.. నాడు తన మీద వ్యతిరేకంగా పోటీ చేసిన జీవన్ రెడ్డిని పార్టీలోకి ఎలా ఆహ్వానిస్తారనేది ఇక్కడ గమనించదగ్గ విషయం.రేవంత్ రెడ్డిని తెలంగాణ ఉద్యమకారుల మీదికి రైఫిల్ తీసుకుని వెళ్లాడు.. ఉద్యమకారులను తిట్టాడు.. ఆంధ్ర పార్టీలో పని చేశాడు.. అంటూ విమర్శిస్తున్న గులాబీ పార్టీ నేతలు.. జీవన్ రెడ్డి రాకను ఏ విధంగా సమర్థించుకుంటారో చెప్పాల్సి ఉంది.ఇక రేవంత్ రెడ్డి విషయానికి వస్తే.. నాడు ఎన్నికల్లో తెలంగాణ ఉద్యమకారులకు సముచిత ప్రాధాన్యం ఇస్తామని చెప్పారు. కానీ ఇంతవరకు అతిగతి లేదు. తెలంగాణ రాష్ట్రానికి ఉద్యమ గేయాన్ని రాష్ట్ర గేయంగా మార్చినప్పటికీ.. ఇంకా చేయాల్సిన పనులు చాలానే ఉన్నాయి. నాడు జీవన్ రెడ్డి పార్లమెంట్ సభ్యుడిగా పోటీలో ఉన్నప్పుడు ప్రచారం చేసింది రేవంత్ రెడ్డి. ఆయనను గొప్ప నాయకుడిగా పేర్కొంది కూడా రేవంత్ రెడ్డినే. ఇప్పుడు అదే రేవంత్ రెడ్డి జీవన్ రెడ్డిని విమర్శించారు. జీవన్ టోన్ అంటూ మండిపడ్డారు. అంతేకాదు జగిత్యాల నియోజకవర్గం లో భారత రాష్ట్ర సమితి గెలిచిన డాక్టర్ సంజయ్ కుమార్ ను గొప్ప నాయకుడిగా అభివర్ణిస్తున్నారు.. వాస్తవానికి కెసిఆర్, రేవంత్ మాట్లాడుతున్న మాటలు తెలంగాణ ప్రజల్లో చర్చకు దారితీస్తున్నాయి. సోషల్ మీడియా ఇప్పుడు బలంగా ఉంది కాబట్టి గతంలో ఈ నాయకులు మాట్లాడిన మాటలను.. ఇప్పుడు మాట్లాడిన మాటలను ఒకసారి బేరీజు వేసుకుంటే అవసరాలకు తగ్గట్టుగానే ఉన్నాయి. వారి పార్టీలో ఉన్నప్పుడు ఒక విధంగా.. పార్టీ నుంచి వెళ్లిపోయిన తర్వాత మరొక విధంగా మాట్లాడటం పట్ల ప్రజలు ఈసడించుకుంటున్నారు. చివరిగా జగిత్యాల సభలో కేసీఆర్ చెప్పినట్టు దళిత బంధు లక్ష కుటుంబాలకు రాలేదు. చివరికి స్టేషన్ ఘన్ పూర్ నాటి ఎమ్మెల్యే రాజయ్య దళిత బంధు పథకాన్ని తనకు అనుకూలంగా మార్చుకుంటే.. పత్రికలలో కథనాలు రావడంతో ముఖ్యమంత్రి కార్యాలయం స్పందించాల్సి వచ్చింది. దీనిని బట్టి నాడు కేసీఆర్ అమలు చేసిన పథకాలు ఎంత గొప్పగా ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు. రేవంత్ రెడ్డి భూపాలపల్లి జిల్లా సభలో చెప్పినట్టు అందరి రైతుల వ్యవసాయ రుణాలు మాఫీ కాలేదు. కొందరి రైతులకు రైతు భరోసా డబ్బులు కూడా బ్యాంకులు ఇవ్వకుండా రుణాల లో మినహాయించుకున్నాయి.. ఏతావాతా చెప్పేది ఏంటంటే.. కెసిఆర్ కోరుకున్నట్టుగా బంగారు తెలంగాణ కాలేదు. రేవంత్ రెడ్డి చెబుతున్నట్టుగా రైజింగ్ తెలంగాణ ఏర్పడలేదు.

# ఏడాది తర్వాత రన్యా రావుకు బెయిల్



**బెంగళూరు :** దేశవ్యాప్తంగా సంచలనం రేపిన కన్నడ నటి రన్యా రావు బంగారం స్మగ్లింగ్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో ప్రధాన నిందితురాలిగా ఉన్న నటికి.. ఎట్టకేలకు బెయిల్ మంజూరయ్యింది. ఏడాది నుంచి ఆమె బెయిల్ కోసం చేస్తోన్న ప్రయత్నాలు ఎట్టకేలకు ఫలించాయి. ప్రస్తుతం రన్యా రావు పరప్పన అగ్రహారం సెంట్రల్ జైల్లో ఖైదీగా ఉన్నారు.బంగారం అక్రమ రవాణా కేసులో ఆరోపణలు ఎదుర్కొంటూ.. ఏడాది నుంచి జైల్లో ఉన్న కన్నడ నటి రన్యా రావుకు ఊరట లభించింది. కర్ణాటక కోర్టు ఆమెకు బుధవారం నాడు బెయిల్‌ను మంజూరు చేసింది. మొత్తం రూ.102 కోట్ల విలువైన బంగారాన్ని దుబాయ్ నుంచి దేశానికి అక్రమంగా తరలించారనేది ప్రధాన ఆరోపణ. ఆర్థిక నేరాల విచారణ న్యాయస్థానం బెయిల్ మంజూరు చేయడంతో రన్యా రావు జైలు నుంచి త్వరలోనే విడుదల కానున్నారు. దుబాయ్ నుంచి బెంగళూరుకు 14.8 కిలోల బంగారాన్ని అక్రమంగా తరలిస్తుండగా గతేడాది మార్చి 3న కెంపెగౌడ విమానాశ్రయంలో డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ అధికారులకు రన్యా రావు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. ఈ భారీ స్మగ్లింగ్ కేసు దేశవ్యాప్తంగా పెను సంచలనం సృష్టించింది. కర్ణాటక సీనియర్ పోలీస్ అధికారి కే. రామచంద్రరావుకు రన్యా రావు సవతి కూతురు. ఈ కేసులో ఆయన పాత్రపై కూడా అప్పట్లో అనుమానాలు వ్యక్తమయ్యాయి.ఈ కేసులో ఏడాది నుంచి బెంగళూరులోని పరప్పన అగ్రహారం సెంట్రల్ జైల్లోనే నటి రన్యా రావు ఉన్నారు. ఆమె బెయిల్ కోసం అనేకసార్లు చేసిన ప్రతిపాదనలను కోర్టులు తిరస్కరించాయి. కేసు తీవ్రత దృష్ట్యా హైకోర్టు ఆమె బెయిల్ పిటిషన్‌ను కొట్టివేసింది. అంతేకాదు, రన్యా రావుపై 'విదేశీ మారక ద్రవ్య రక్షణ, స్మగ్లింగ్ కార్యకలాపాల నివారణ' చట్టం కింద కేసు నమోదయ్యింది. ఈ చట్టం కింద అరెస్టైన వారు తప్పనిసరిగా ఏడాది జైలు శిక్ష అనుభవించాల్సి ఉంటుంది. అందుకే గత ఏడాది కాలంగా బెయిల్ కోసం ఆమె చేసిన ప్రయత్నాలు విఫలయమ్యాయి. రూ. 102 కోట్ల విలువైన బంగారం స్మగ్లింగ్ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) రన్యా రావు పాత్రపై పక్కా ఆధారాలతో ప్రత్యేక కోర్టులో ఛార్జ్‌షీట్ దాఖలు చేసింది. సీనియర్ ఐపీఎస్ అధికారికి ఆమె సవతి కుమార్తె కావడంతో తనను ఎవరూ తనిఖీ చేయరనే ధైర్యంతో బంగారం స్మగ్లింగ్‌కు తెరతీసింది. కేవలం 15 రోజుల వ్యవధిలో రన్యా రావు నాలుగు సార్లు దుబాయ్ పర్యటనకు వెళ్లడం అనుమానం రేకెత్తించింది. దీంతో 2025 మార్చి 3న దుబాయ్ నుంచ తిరిగొస్తుండగా విమానాశ్రయం ఎగ్జిట్ గేట్ వద్ద రెవెన్యూ ఇంటెలిజెన్స్ అధికారులు అడ్డుకుని తనిఖీ చేయడంతో గుట్టురట్టయ్యింది. ఏకంగా ఆమె వద్ద 14.2 కిలోల బంగారం బయటపడింది. కమిషన్ కోసం కక్కుర్తిపడి గోల్డ్ స్మగ్లింగ్‌లో భాగస్వామ్యమైనట్టు తేలింది. కిలోకు రూ.4-5 లక్షలు కమిషన్‌గా వచ్చేదని ఈడీ విచారణలో వెల్లడయ్యింది. ఇక, ఈ కేసులో రన్యారావుతో పాటు తెలుగు వ్యక్తి తరుణ్ కొండూరు, బళ్లారికి చెందిన వ్యాపారి సాహిల్ సకారియా జైన్‌లు కూడా ఉన్నారు.

## డిపోలకే పరిమితమైన ప్రగతి చక్రాలు

-మొదటిపేజీ తరువాయి
వంటి వివిధ గమ్యస్థానాలకు పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సులు నడిపించారు. అయితే సుదూర ప్రాంతాలకు ప్రయాణించడానికి మాత్రం ప్రయాణికులు ప్రైవేటు వాహనాలపైనే ఆధారపడ్డారు.

**తాత్కాలిక సిబ్బందితో**

రాష్ట్రంలో ఈ రోజు నుంచి పాఠశాలలకు సెలవులు ఇవ్వడంతో వసతిగృహాల్లో చదువుకున్న విద్యార్థులు తమ స్వస్థలాలకు వెళ్లేందుకు ఇబ్బందులు పడ్డారు. ప్రయాణికుల సంఖ్యకు అనుగుణంగా బస్సుల కొరత ఏర్పడింది. దీంతో ప్రయాణికులు బస్ స్టాండ్‌ల వద్ద గంటల తరబడి వేచి ఉండాల్సి వచ్చింది. భారీ వాహనాల లైసెన్సులు, పెద్ద వాహనాలను నడపడంలో ముందస్తు అనుభవం ఉన్న వారికి ప్రైవేట్ డ్రైవర్ల డ్రైవింగ్ నైపుణ్యాలను రోడ్డు రవాణా శాఖ అధికారులు నేరుగా డిపో ప్రాంగణంలోనే పరిశీలించి అనంతరం వారికి బస్సులు నడపడానికి అనుమతించారు. ఇదిలా ఉండగా పదో తరగతి ఉత్తీర్ణులైన వారికి కండక్టర్లుగా పనిచేసే అవకాశాలు కల్పించడంతో వందలాది మంది అభ్యర్థులు డిపోలకు తరలివచ్చారు. వారిలో కొందరిని అక్కడికక్కడే ఎంపిక చేసి టిమ్? యంత్రాలను నడపడంపై వెంటనే శిక్షణ ఇచ్చారు. ఆర్టీసీ బస్సులను నడపడంలో చెప్పుకోదగ్గ అనుభవం లేని డ్రైవర్లకు స్టీరింగ్ వీల్స్ అప్పగించారని ఆందోళనతోనే ప్రయాణికులు బస్సులు ఎక్కారు.

**హైదరాబాద్‌లో కేవలం 850 బస్సులు**

హైదరాబాద్ నగరంలో సాధారణ రోజుల్లో రెండు లేదా మూడు బస్సులు మారితే గానీ ఆఫీస్‌కు చేరలేని పరిస్థితి. కానీ ఇప్పుడు అసలు బస్సు దొరకడమే పెద్ద సవాల్?గా మారింది. గ్రేటర్ ఆర్టీసీ 850 బస్సులు నడిపింది. ఇవి సాధారణ రోజుల్లో నడిపే వాటితో పోల్చితే ఇది కేవలం 28 శాతం మాత్రమే. శివారు ప్రాంతాల నుంచి నగరానికి చేరుకోవడం చాలా కష్టంగా మారింది.

**అద్దె బస్సు డ్రైవర్లు ఇంటిముఖం**

కార్మికులు ఉదయం నుంచే డిపోల వద్దకు చేరుకొని బస్సులు బయటికి రాకుండా అడ్డుకున్నారు. ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్, రోజువారీ కార్మికులు బస్సులు తీసే క్రమంలో జేఏసీ నేతలతో వాగ్వాదం జరిగింది. దీంతో కొందరు అద్దె బస్సు డ్రైవర్లు ఎటూ పాలుపోక ఇంటిముఖం పట్టారు.

**తెల్లవారుజామున వచ్చినా ఫలితం లేదు**

కార్యాలయానికి వెళ్లేందుకు రోజూ రెండు బస్సులు మారాలి. 92ఏ బస్సులో అత్తాపూర్? నుంచి రేతిబౌలి అక్కడి నుంచి 216 లేదా 217లో బయోడైవర్సిటీ బస్టాప్?కు చేరుకొని అక్కడి నుంచి నడిచి వెళ్లాలి. ఈ రెండు బస్సులు లేకపోతే 300ఎల్?/126 బస్సులో వెళితే రెండు బస్సులు మారే బాధ తప్పుతుంది. గురువారం ఒక్క బస్సు కూడా దొరక్కపోవడంతో వ్యక్తిగత వాహనంలో ఆఫీస్?కి చేరుకుంటున్నారు.

## తెలంగాణ ఐపీఎస్ అధికారుల బదిలీలు

-మొదటిపేజీ తరువాయి
బాధ్యతలు స్వీకరించనున్నారు. హోం శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీగా శిఖా గోయల్ నియమితులయ్యారు. దీంతో పాటు సైబర్ సెక్యూరిటీ బ్యూరో, ఫోరెన్సిక్ ల్యాబ్ అదనపు బాధ్యతలు కొనసాగుతాయి. విజిలెన్స్ ఢ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీజీగా దేవేంద్ర సింగ్ చౌహాన్ బదిలీ అయ్యారు. మల్టీ జోన్-2 ఐజీపీగా నియమితులైన షాహ్నవాజ్ ఖాసిమకు పర్సనల్ ఐజీపీ అదనపు బాధ్యతలు అప్పగించారు. సుధీర్ బాబు పదవీ విరమణ నేపథ్యంలో ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనర్‌గా తరుణ్ జోషి నియమితులయ్యారు. అవినాష్ మహంతి డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ డీజీగా బదిలీ కాగా, ఏసీబీ డైరెక్టర్ అదనపు బాధ్యతలను నిర్వర్తిస్తారు. కార్తికేయ ఐజీపీ ఇంటెలిజెన్స్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు. మల్కాజిగిరి పోలీస్ కమిషనర్‌గా, ప్రస్తుతం ాౌదీ (ఇంటెలిజెన్స్) ×ౌగా ఉన్న బి. సుమతి నియమితులు కావడం విశేషం.

**తెలంగాణ నూతన డీజీపీగా సీవీ ఆనంద్**

తెలంగాణ నూతన డీజీపీగా సీవీ ఆనంద్‌ను నియమించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఈ నెల 30న ప్రస్తుత డీజీపీ శివధర్ రెడ్డి పదవీ విరమణ చేయనున్నారు. ఆ తర్వాత సీవీ ఆనంద్ మే మొదటి వారంలో బాధ్యతలు స్వీకరించనున్నట్లు సమాచారం. ప్రస్తుతం హోం శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా సీవీ ఆనంద్ ఉన్నారు. తాజాగా జరిగిన బదిలీల్లో ఆ స్థానంలో శిఖా గోయల్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

## ఆర్టీసీ విషయంలో బీఆర్ఎస్, కాంగ్రెస్.. దొందూ దొందే

-మొదటిపేజీ తరువాయి
శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం మొండి వైఖరి వలన నర్సంపేటకి అర్టీసీ డ్రైవర్ ఆత్మహత్య చేసుకున్నాడు. కార్మికుల కొసం శంకర్ గౌడ్ బలిదానం అయ్యాడు. ఇది ముమ్మాటికి రాష్ట్ర ప్రభుత్వం హత్యనే. కాంగ్రెస్ ప్రభుత్వం బెదిరింపులకు దిగడం సరికాదు. ఆర్టీసీలో 39 వేల మంది ఉద్యోగులు ఉన్నారు. వాళు దుర్భర జీవితం గడుపుతున్నారు. రిటైర్డ్ కార్మికులకు వచ్చే ఫించన్ కూడా చాలా తక్కువ. బీఆర్ఎస్ హయాంలో కార్మికులు సమ్మెకు దిగితే ఎస్మా ప్రయోగించారు. ఆ సమ్మెలో 20 మంది చనిపోయారు. అయినా బీఆర్ఎస్ కనికరించలేదు. కార్మికులు 52 రోజులపాటు సమ్మె చేశారు. ఆ సమయంలో కార్మికుల కోసం పోరాడి మేం జైలుకు వెళ్లాం. మా పోరాటం ఫలితంగానే బీఆర్ఎస్ దిగి వచ్చింది. కాంగ్రెస్‌ది అభయ హస్తం కాదు.. భస్మాసుర హస్తం. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తామని కాంగ్రెస్ పార్టీ తన మేనిఫెస్టోలో పెట్టింది. ఆర్టీసీ పునరుద్ధరణకు సహకరిస్తామని చెప్పింది. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన 100 రోజుల్లోనే ఆ హామీని నెరవేరుస్తామని చెప్పింది. కానీ, 900 రోజులు అవుతున్నా ఆ డిమాండ్లు నెరవేరలేదు. ఆ మేనిఫెస్టోలో పెట్టిన అంశాలనే ఇవాళ కార్మికులు అడుగుతున్నారు. గత ప్రభుత్వం లాగానే ఈ ప్రభుత్వం వ్యవహరిస్తోంది. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఉద్దేశిస్తూ.. కేంద్రాన్ని అడిగి మీ మేనిఫెస్టో రూపకల్పన చేశారా? బీఅర్ఎస్ పార్టీ మోసం చేసిందనే కదా మీకు ఓటు వేసింది. అలాంటప్పుడు కమిటీల పేరుతో కాలయాపన ఎందుకు?. రాష్ట్ర ప్రభుత్వం దిగివచ్చి సమస్యని పరిష్కారించాలి. మంత్రుల యాభై శాతం జీతం కోత వలన ఏం ప్రయోజనం?. ఢిల్లీ, తమిళనాడు, కేరళ,అస్సాం రాష్ట్రాలకి తెలంగాణ నుండే డబ్బులు పోతున్నాయి. మంత్రులు అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్న ఆస్తుల్లో సగం అమ్మినా కార్మికుల బాధలు పొతాయి అని విమర్శలు గుప్పించారాయన. ఆర్టీసీ కార్మికుల దీక్షకి బీజేపీ సంపూర్ణ మద్దతు ఉందన్న బండి సంజయ్.. ప్రత్యామ్నాయ ఏర్పాట్లలో భాగంగా లైసెన్స్, శిక్షణ లేనివారిని తాత్కాలిక ఉద్యోగాలు ఇవ్వడం ఏంటని నిలదీశారు. అలాగే తొందరపడవద్దని.. కలిసి కొట్లాడుదామని ఆర్టీసీ కార్మికులకు ఆయన పిలుపు ఇచ్చారు.

## ఐ బొమ్మ రవి పొలిటికల్ అనలిస్ట్ అవతారం

**హైదరాబాద్ :** సినిమాల పైరసీ.. వాటిని తన వెబ్సైట్లో అప్లోడ్ చేయడం.. దానిద్వారా అక్రమంగా డబ్బు సంపాదించడం వంటి వాటిని అలవాటుగా మార్చుకున్న ఐ బొమ్మ రవి.. ఇప్పుడు కొత్త అవతారం ఎత్తాడు. తెలంగాణ పోలీసులు పట్టుకోవడం.. తమదైన స్టైల్ లో ట్రీట్మెంట్ ఇవ్వడంతో అతడు తన ధోరణి మార్చుకున్నాడు. 100 జింకలను తిన్న పులి శాంతి కపోతంగా మారినట్టు.. అక్రమ వ్యాపారానికి.. దందాలకు అలవాటు పడి.. చివరికి పోలీసులకు చిక్కిన రవి.. ఇప్పుడు పొలిటికల్ ఎనలిస్టుగా మారిపోయాడు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా ఐదు రాష్ట్రాల్లో ఎన్నికలు జరుగుతున్నాయి. ఇందులో తమిళనాడు రాష్ట్రంలో జరుగుతున్న ఎన్నికల పట్ల యావత్ దేశం మొత్తం ఆసక్తిగా ఉంది. ఎందుకంటే డిఎంకె కాంగ్రెస్, అన్న డీఎంకే బీజేపీ, టీవీకే పార్టీలు ఇక్కడ పోటీలో ఉన్నాయి. అధికారాన్ని దక్కించుకుంటామని డిఎంకె.. ఈసారి మార్పు స్పష్టంగా ఉంటుందని అన్న డిఎంకె.. ప్రజలు కొత్త తరహా రాజకీయాలను చూస్తారని టీవీ కే నేతలు చెబుతున్నారు రికార్డు స్థాయిలో 91 శాతాన్ని మించి అక్కడ పోలింగ్ నమోదు అయినట్టు వార్తలు వస్తున్నాయి. ఇంకా చాలామంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకోవడానికి క్యూ లైన్ లో ఉన్నట్టు తెలుస్తోంది. సాయంత్రం ఐదు గంటల వరకే పోలింగ్ సమయం ముగియడంతో.. ఆ సమయం నాటికి పోలింగ్ కేంద్రంలో ఉన్న వారికి ఓటు హక్కు వినియోగించుకునే అవకాశాన్ని పోలీసులు ఇస్తున్నారు.పోలింగ్ నేపథ్యంలో రవి ట్విట్టర్లో ఒక ట్వీట్ చేశాడు. దాని ప్రకారం తమిళనాడు రాష్ట్రా ఎన్నికల్లో అధికార డిఎంకె మరోసారి అధికారాన్ని దక్కించుకునే అవకాశం ఉందట. విజయ్ పార్టీకి 15 నుంచి 20 వరకు ఓటింగ్ లభిస్తుందట. జన నాయకుడు సినిమా విడుదల కాకముందే లీక్ అయింది. దీంతో తమిళ ప్రజల్లో విజయ్ పట్ల సింపతి పెరిగింది.

## సంపాదకీయం

# బీజేపీకి రాహుల్ బలం

జాతీయ రాజకీయాల్లో శతాబ్ద కాలం పైగా చరిత్ర కలిగిన కాంగ్రెస్ పార్టీ, ప్రస్తుత మోదీ శకాన్ని ఎదుర్కోవడంలో అనుసరిస్తున్న వ్యూహాలు ఆ పార్టీని మరింత ఆత్మరక్షణలో పడేస్తున్నాయి. ప్రధాని నరేంద్ర మోదీ అనుసరిస్తున్న రాజకీయ ఎత్తుగడలను దీటుగా ఎదుర్కోవడంలో కాంగ్రెస్ పార్టీ పూర్తిగా విఫలమవుతోంది. మోదీ ఏ నిర్ణయం తీసుకున్నా, దానికి నిర్మాణాత్మకమైన ప్రత్యామ్నాయాన్ని చూపాల్సింది పోయి.. గుడ్డిగా వ్యతిరేకించడమే పనిగా పెట్టుకుందనే విమర్శలు వినిపిస్తున్నాయి. మోదీ పరిపాలనపై చర్చించకుండా కేవలం ఆయనను వ్యక్తిగతంగా టార్గెట్ చేయడం వల్ల ప్రజల్లో కాంగ్రెస్ పట్ల ప్రతికూలత పెరుగుతోంది. ''గతంలో 'మౌత్ కా సౌదాగర్' నుంచి మొన్నటి 'చౌకీదార్ చోర్ హై' వరకు, ఇప్పుడు ప్రధానిని 'టెర్రరిస్టు' అంటూ సంబోధించే స్థాయికి కాంగ్రెస్ నేతలు దిగజారడం ఆ పార్టీకే నష్టం చేకూరుస్తోంది. ఒక దేశ ప్రధానిని అప్రజాస్వామిక పదజాలంతో దూషించిన ప్రతిసారీ మోదీ దానిని అస్త్రంగా మార్చుకుని ప్రజాక్షేత్రంలో సానుభూతి పొందుతున్నారు. కాంగ్రెస్ ఉక్రోశం నుంచి పుట్టుకొస్తున్న ఇటువంటి వ్యాఖ్యలు రాహుల్ గాంధీ, ఖర్గే నాయకత్వాన్ని మరింత బలహీనంగా చూపిస్తున్నాయి. జాతీయ భావాలు బలంగా ఉన్న ఈ రోజుల్లో, ప్రధానిని ఉగ్రవాదితో పోల్చడం సామాన్య ఓటర్లకు మింగుడుపడటం లేదు. కాంగ్రెస్ పార్టీ ప్రస్తుతం ఏ సిద్ధాంతంపై నడుస్తోంది? ఏ వర్గాల కోసం పోరాడుతోంది? అనే విషయంలో ప్రజలకే కాదు, ఆ పార్టీ శ్రేణులకు కూడా స్పష్టత లేదు. బీజేపీ హిందుత్వ కార్డును ఎదుర్కోవడానికి సాఫ్ట్ హిందుత్వ ను అనుసరించాలా లేక సెక్యులరిజం వైపు ఉండాలా అనే సందిగ్ధంలో కొట్టుమిట్టాడుతోంది. క్షేత్రస్థాయిలో పార్టీ నిర్మాణం కుప్పకూలుతున్నా, అగ్ర నాయకత్వం కేవలం ఢిల్లీలో కూర్చుని సోషల్ మీడియా వార్లకే పరిమితమవుతోంది. ఈ చేతకాని రాజకీయాల వల్ల రాహుల్ గాంధీ ఇమేజ్ బిల్డప్ అవ్వడం కంటే, మరింత చులకన అవుతోంది. జాతీయ స్థాయిలో బీజేపీకి ప్రత్యామ్నాయంగా నిలబడాల్సిన కాంగ్రెస్, రోజురోజుకూ ప్రాంతీయ పార్టీల దయాదాక్షిణ్యాలపై ఆధారపడే స్థితికి చేరుకుంది. 2029 సార్వత్రిక ఎన్నికల ముందు మహిళా రిజర్వేషన్ బిల్లుతో సహా లోక్‌సభ సీట్లను పెంచాలనే బీజేపీ కలకు బ్రేక్ పడింది. లోక్‌సభలో శుక్రవారం ప్రవేశపెట్టిన 131వ రాజ్యాంగ సవరణ బిల్లు వీగిపోయింది. దీంతో మహిళా బిల్లుతో సహా మరో బిల్లును కేంద్రం ఉపసంహరించుకుంది. 2/3 వంతు మద్దతును ఎన్డీయే ప్రభుత్వం కూడగట్టలేకపోయింది. బయట నుంచి చూస్తే ఇది బీజేపీకి ఘోర పరాజయంగా కనిపించవచ్చు, కానీ రాజకీయంగా ఇది బీజేపీకి విజయమే అని విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ మొత్తం ఎపిసోడ్‌లో "ఓడిపోయి బీజేపీ గెలిచింది. గెలిచి కాంగ్రెస్ ఓడిపోయింది" అని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. లోక్‌సభలో బిల్లుకు వ్యతిరేకంగా ఓట్లు పడిన తర్వాత, కేంద్ర మంత్రి కిరెన్ రిజిజు మాట్లాడుతూ.. ఒక చారిత్రాత్మక బిల్లును ప్రతిపక్షాలు అడ్డుకున్నాయని విమర్శించారు. మహిళా బిల్లును అడ్డుకున్నారని మండిపడ్డారు. అయితే, తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. బీజేపీకి సంఖ్యా బలం లేదని ముందే తెలుసు. కానీ ప్రతిపక్షాల నుంచి మద్దతు వస్తుందని ఊహించారు. ఒక వేళ ఓడిపోతే ప్లాన్-బికి కూడా బీజేపీ సిద్ధంగా ఉంది. ఇప్పుడు గెలిచినా, ఓడినా క్రెడిట్ మొత్తం బీజేపీ ఖాతాలోకే వెళ్లినట్లయింది. "మహిళా రిజర్వేషన్లకు ప్రతిపక్షాలు, కాంగ్రెస్ వ్యతిరేకం" అని బీజేపీ ఒక రాజకీయ నినాదాన్ని సృష్టించబోతోంది. పశ్చిమబెంగాల్, తమిళనాడు ఎన్నికల ముందు ఇది ఎంతో కొంత ప్రభావం చూపించే అంశంగా మారింది. గురువారం లోక్‌సభలో ప్రధాని మోడీ మాట్లాడుతూ.. ఈ బిల్లును వ్యతిరేకించే వారిని దేశంలో మహిళలు క్షమించరని చెప్పారు. ఇక ఇప్పటి నుంచి ప్రతిపక్షాలను ముఖ్యంగా కాంగ్రెస్‌పై బీజేపీ విరుచుకుపడుతుంది. కాంగ్రెస్, ఇండీ కూటమి బిల్లుకు వ్యతిరేకమనే ఒక వాదనను ప్రజల్లోకి తీసుకెళ్తుంది. 2010లో మహిళా రిజర్వేషన్లను వ్యతిరేకించి సమాజ్‌వాదీ పార్టీ, ఆర్జేడీలు రాజకీయంగా కొంత కాలం దెబ్బతిన్నాయి. 2010లో అప్పటి మన్మోహన్ సింగ్ సర్కార్ మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లును తీసుకువచ్చింది. ఎస్పీ అధినేత ములాయం సింగ్ యాదవ్, ఆర్జేడీ చీఫ్ లాలూ ప్రసాద్ యాదవ్‌లు వ్యతిరేకించారు. ప్రతిపక్షాలు బీజేపీ ప్రవేశపెడుతున్న బిల్లులు రాజ్యాంగ వ్యతిరేకమని, దేశ రాజకీయ స్వరూపాన్ని మార్చే కుట్ర అని రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీ వాదిస్తున్నారు. వీటన్నింటిని పక్కన పెట్టి బీజేపీ మాత్రం కాంగ్రెస్ మహిళా వ్యతిరేకమనే నేరెటివ్‌ను తయారు చేస్తుంది. మొత్తానికి బీజేపీ బిల్లుల విషయంలో ఓడిపోయినప్పటికీ, రాజకీయ వ్యూహాల్లో మాత్రం గెలిచిందని చెబుతున్నారు.

# రేడియో ఆవిష్కర్త మార్కొనీ



గుగ్లి ఎల్మో జియోవన్ని మారియా మార్కోనీ (1874 ఏప్రిల్ 25 – 1937 జూలై 20) ఇటాలియన్ ఆవిష్కర్త, ఎలక్ట్రికల్ ఇంజనీర్. అతను సుదూర ప్రాంతాలకు రేడియో ప్రసారాలు పంపుటకు, రేడియో టెలిగ్రాఫ్ వ్యవస్థను అభివృద్ధి చేయుటలో పితామహుడుగా గుర్తింపు పొందాడు. అతను రేడియో యొక్క ఆవిష్కర్త. 1909 లో కార్ల్ ఫెర్డినాండ్ బ్రాన్ తో కలసి వైర్?లెస్ టెలిగ్రాఫీ అనే అంశంపై భౌతిక శాస్త్రంలో నోబెల్ బహుమతి తీసుకున్నాడు. 1897 లో బ్రిటన్ లో వైర్?లెస్ టెలిగ్రాఫ్, సిగ్నల్ కంపెనీకి వ్యవస్థాపకునిగా ఉన్నాడు. అతను ఇతర భౌతిక శాస్త్రవేత్తల ప్రయోగాలను ఆధారంగా చేసుకొని రేడియో అనే కొత్త ఆవిష్కరణ చేసి వ్యాపార రంగంలో ఘనమైన విజయాన్ని సాధించాడు. రేడియో అనేది విద్య స్థాయి, సామాజిక, ఆర్థిక స్థితి, లింగం వయస్సుతో సంబంధం లేకుండా ప్రపంచ వ్యాప్తంగా చాలా మందికి చేరే మాస్ మీడియా. కాంతి వేగ పౌనఃపున్యాలతో విద్యుత్ అయస్కాంత తరంగాలను మాడ్యులేషన్ చేయటం ద్వారా తీగల ఆధారము లేకుండా గాలిలో శబ్ద సంకేతాలను ప్రసారం చేయు ప్రక్రియను దూర శ్రవణ ప్రక్రియ అంటారు. ఇలాంటి ప్రసారాలను వినటానికి ఉపయోగించే సాధనాన్ని రేడియో అంటారు. సమాచారాల చేర వేత కోసం గతంలో చాలామంది చేసిన ప్రయోగాలన్నీ మార్కోనీ పరిశోధనలకు దోహద పడ్డాయి. మార్కోని 1874 ఏప్రిల్ 25 లో ఇటలీ దేశంలోని బొలొగ్నాలో అన్నీ జేమ్?సన్, గుసెప్ మార్కోనీ దంపతులకు జన్మించాడు. విద్యార్థి దశలో మార్కోనీ పరిశోధనల పట్ల మక్కువ చూపించేవాడు. తన తల్లిదండ్రులచే నియమించబడిన ప్రైవేట్ ఉపాధ్యాయుల నుండి ఇంట్లో రసాయనశాస్త్రం, గణితం, భౌతిక శాస్త్రాలను నేర్చుకున్నాడు. లివోర్నోలోని ఉన్నత పాఠశాల భౌతిక ఉపాధ్యాయుడు ప్రొఫెసర్ విన్సెంజో రోసా 17 ఏళ్ల మార్కోనీకి భౌతిక దృగ్విషయాల ప్రాథమిక విషయాలను, అలాగే విద్యుత్తుపై కొత్త సిద్ధాంతాలను నేర్పించాడు. 18 యేళ్ళ వయస్సులో అతను తిగిరి బోలోగ్నాకు తిరిగి వచ్చాడు. 1890 ల ప్రారంభంలో, అతను "వైర్‌లెస్ టెలిగ్రాఫీ" అనే ఆలోచనపై పనిచేయడం ప్రారంభించాడు, అంటే ఎలక్ట్రిక్ టెలిగ్రాఫ్ ఉపయోగించిన వైర్లను కనెక్ట్ చేయకుండా టెలిగ్రాఫ్ సందేశాలను ప్రసారం చేయడం. బోలోనా విశ్వవిద్యాలయానికి చెందిన ప్రొఫెసర్ రీగ్ అధ్వర్యంలో ఇరవయ్యేళ్ళ యువకుడు మార్కోనీ కొన్ని నెలల పాటు కృషి చేశాడు. తల్లిదండ్రులతో బాటు నివసిస్తున్న తన ఇంటి పై అంతస్తు లోనే అతని ప్రయోగశాల ఉండేది. 1888 లో, విద్యుదయస్కాంత వికిరణాన్ని ఉత్పత్తి చేయగలవచ్చునని, గుర్తించగలమని నిరూపించాడు. ఒకరోజు అర్ధరాత్రి సమయంలో తల్లిని నిద్రలేపి ఓ తమాషా చూపిస్తానని పైకి తీసుకెళ్ళాడు. ఒకచోట మోర్స్ కీ 12 అడుగుల దూరంలో ఎలక్ట్రిక్ బెల్ ని అమర్చాడు. కీని నొక్కినప్పుడల్లా గంట మోగడం ప్రారంభించింది. మధ్యలో తీగలు లేకపోయినా గంట మోగటం ఆశ్చర్య పరిచింది. వైర్ లెస్ విధానం ద్వారా తొలి సంకేతాన్ని ప్రసారం చేసిన ఈ ప్రయోగం గొప్ప చారిత్రాత్మక సంఘటన అని చాలాకాలం తరువాత మార్కోనీ తల్లి గ్రహించ గలిగింది. మార్కొనీ క్రమంగా సంకేతాలు వెళ్ళగలిగే దూరాన్ని పెంచుతూ పోయాడు. ఓ చిన్న గుట్ట ఆవలిపైపు దాకా సంకేతాలు వెళ్ళగలిగాయి. సంకేతం ఆవలి వైపున చేరగానే దాన్ని గుర్తించానని తెలియ జేయడానికి గాను ఆయన తమ్ముడు గుట్టపై నిలబడి నాట్యం చేసేవాడు.

క్రమంగా సంకేతాలను ఎక్కువ దూరం ప్రసరించేలా చేయడంలో మార్కోనీ కృతకృత్యు డయ్యాడు. 1898 వేసవిలో సముద్ర మధ్యంలో జరిగిన పడవ పందేల గురించి ఎప్పటికప్పుడు వార్తలు పంపడానికి డబ్లిన్ వార్తా పత్రిక మార్కోనీని నియమించింది. ఆయన సముద్ర తీరంలో గ్రాహకాన్ని అమర్చి, వైర్ లెస్ ప్రసారిణిని ఓ పడవలో ఉంచుకొని బయలు దేరాడు. వార్తలను వైర్ లెస్ ద్వారా సముద్ర తీరానికి పంపితే, అక్కడి నుంచి వార్తా పత్రిక కార్యాలయానికి టెలిఫోన్ ద్వారా చేర వేశారు. వైర్ లెస్ ద్వారా పంపబడిన మొట్టమొదటి పత్రికా వార్త ఇదే. వేల్స్ రాకుమారుడు ఒకసారి విహార నౌకలో వెడుతూ వైట్ దీవుల కావల జబ్బు పడ్డాడు. కుమారుని ఆరోగ్య పరిస్థితిని ఎప్పటి కప్పుడు తెలుసు కోవాలని విక్టోరియా రాణి సంకల్పించింది. వెంటనే మార్కోనీని అభ్యర్థించగా అతడు వైర్ లెస్ పరికరాలను నెలకొల్పి, 16 రోజుల పాటు నిర్విరామంగా వార్తలను చేరవేసే ఏర్పాటు చేశాడు. మొత్తం 150 టెలిగ్రాంలు అటూ, యిటూ ప్రసారం చేయబడ్డాయి. 1909 లో రెండు పడవలు సముద్ర మధ్యంలో ఢీ కొన్నాయి. వైర్ లెస్ ద్వారా తీరానికి సమాచారం వెంటనే అందించక పోయి ఉంటే 1700 మంది ప్రయాణీకులు మునిగిపోయే వారు. 1912 ఏప్రిల్ లో టైటానిక్ అనే ఓడ సముద్ర మధ్యంలో ఓ మంచు కొండను ఢీకొంది. ఓడ మునిగి పోతుండగా అక్కడి ఆపరేటర్ వైర్ లెస్ ద్వారా ౹౹౹ సంకేతాలను అనేక సార్లు పంపించాడు. ఫలితంగా 700 మందిని రక్షించటానికి వీలైంది. 1907 లో బ్రిటిష్ నావికాదళానికి చెందిన ఓడలు ప్రపంచ పర్యటన చేస్తున్న సందర్భంగా జాతీయ గీతం వాద్యాలాపనను ఒక ఓడ నుండి మరో ఓడకి ప్రసారం చేసుకో గలిగారు. మొదటి ప్రపంచ యుద్ధ కాలంలో సముద్ర తీరం నుంచి 30 మైళ్ల దూరంలో ఉండే యుద్ధనౌకకు వైర్ లెస్ ద్వారా మార్కోనీ సందేశం పంపించ గలిగాడు. మార్కోనీ రేడియో ప్రసారానికి సంబంధించిన పరిశోధనల్ని అవిశ్రాంతంగా కొనసాగించాడు. లిస్బన్ వద్ద సముద్ర తీరంలో వైర్ లెస్ పరికరాల్ని అమర్చి 300 మైళ్ళ దూరం దాకా సంభాషణల్ని ప్రసారం చేయగలిగాడు. కొన్ని నెలల లోపే ప్రపంచంలో కెల్లా తొలి ప్రసార కేంద్రం (ఎతీశీఖుం ఝుర్అఅస్త్ర ర్ఫ్ఆశీఅ) పిట్స్ బర్గ్ లో స్థాపించ బడింది. అమెరికా అధ్యక్షుడిగా హార్డింగ్ ఎన్నికయ్యాడన్న వార్తను తొలి ప్రసారంలో ప్రకటించటంతో 1920 నవంబరు 2 వ తేదీన కార్యక్రమాలు ప్రారంభ మైనాయి. 1922 మే నెలలో 100 వాట్ల సామర్థ్యం గల రేడియో ప్రసార కేంద్రాన్ని లండనులో స్థాపించారు. 1922 నవంబరులో బ్రిటనులో ప్రసార హక్కులు గల ఏకైక సంస్థ బి.బి. సి. నవంబరు 14 నుంచి లండను కేంద్రం రోజువారీ ప్రసారాలు ప్రారంభించింది. అమెరికా బెల్ టెలిఫోన్ ప్రయోగ శాలల్లో పనిచేసే పరిశోధక బృందం తొలి ట్రాన్సిస్టర్ 1948 లో తయారు చేసింది. బాంబే ప్రెసిడెన్సీ రేడియో క్లబ్, ఇతర రేడియో క్లబ్‌ల కార్యక్రమాలతో బ్రిటిష్ రాజ్ సమయంలో జూన్ 1923 లో భారత దేశంలో ప్రసారం ప్రారంభమైంది. 1927 జూలై 23 న జరిగిన ఒక ఒప్పందం ప్రకారం, ప్రైవేట్ ఇండియన్ బ్రాడ్‌కాస్టింగ్ కంపెనీ లిమిటెడ్ (ఐబిసి) రెండు రేడియో స్టేషన్లను నిర్వహించడానికి అధికారం ఇచ్చింది: 1927 జూలై 23 న ప్రారంభమైన బొంబాయి స్టేషన్, కలకత్తా స్టేషన్ 1927 ఆగస్టు 26 న ప్రారంభమైంది. 1930 మార్చి 1 న కంపెనీ పరిసమాప్తిలోకి వెళ్లింది. ప్రభుత్వం ప్రసార సదుపాయాలను స్వాధీనం చేసుకుంది, 1930 ఏప్రిల్ 1 న రెండు సంవత్సరాల పాటు ప్రయోగాత్మక ప్రాతిపదికన ఇండియన్ స్టేట్ బ్రాడ్కాస్టింగ్ సర్వీస్ ను ప్రారంభించింది. 1936 జూన్ 8 న ఆల్ ఇండియా రేడియోగా మారింది.

# దేశ విదేశాల్లో రాణించిన టంగుటూరి

భానుమతి వలెనే టంగుటూరి సూర్యకుమారి కూడా బహు ముఖ ప్రజ్ఞావంతురాలు. ఆమె నాట్యకారిణి, నటి, గాయని మాత్రమే కాదు మంచి వక్తగా కూడా గుర్తింపు తెచ్చుకుంది, తెలుగు పాటని, తెలుగు భాషని, భారతీయ నృత్యాలను స్వదేశంలోనే కాకుండా విదేశాల్లోనూ ప్రాచుర్యం పొందడానికి ఆవిడ చేసిన కృషి అపూర్వం. అనన్య సామాన్యం. ప్రాచ్య, పాశ్చాత్య నృత్య, సంగీతాలకు మధ్య సుహృద్భావ సేతువుగా అంతర్జాతీయ కీర్తినందిన మధురగాయని ఆమె. టంగుటూరి సూర్యకుమారి (నవంబర్ 13, 1925 – ఏప్రిల్ 25, 2005) అలనాటి తెలుగు సినిమా నటి, ప్రసిద్ధ గాయకురాలు. ఆమె నవంబర్13,1925లో రాజమండ్రిలో జన్మించారు. ఆంధ్ర రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు తమ్ముడు టంగుటూరి శ్రీరాములు కూతురు. మూడో ఏటనుంచే పాటలుపాడేది. 1937లో మద్రాసు చేరుకుని, పన్నెండు, పదమూడేళ్ళ ప్రాయంలోనే సినీరంగ ప్రవేశము చేసి, 'రైతుబిడ్డ' సినిమాలో నటించింది. 1952లో ఆమె తొలి మద్రాసు అందాల సుందరి (మిస్ మద్రాసు)గా ఎంపికైంది. సూర్యకుమారి రూపం, కంఠస్వరం రెండూ బాగా ఉండడంచేత, అప్పటికే పెదనాన్న ప్రకాశం సభల్లో ప్రార్థన గీతాలు పాడుతూండడం చేత సినిమావారి పిలుపు వచ్చింది. సాంప్రదాయ నియమ, నిష్టలుగల కుటుంబం కావడం చేత కొంత వ్యతిరేకత ఎదురయ్యింది. సూర్యకుమారి కంఠం, రంగూ, రూపం ఆకర్షణీయంగా ఉన్నా, మామూలు అమ్మాయిల కంటే కొంచెం పొడవుగా ఉండటం చేత, సినిమా రంగంలో సమస్య ఎదురైంది. ఆనాటి సగటు హీరోలు ఆమె కంటే పొట్టిగా ఉండటం కారణం. అదీ కాక ఆమె బ్రాహ్మణ, పేరుపొందిన రాజకీయ కుటుంబం నుంచి రావటమే కాదు, ప్రేమ సన్నివేశాలలో హీరోయిన్ మీద హీరో చెయ్యి వెయ్యడం, ఇత్యాదివి ఒప్పుకొనేవారు కాదు. గొప్ప చాతుర్యం ఉండి కూడా ఆమె సినిమాల్లో సుస్థిరత పొందలేక పోయింది. అయినా సూర్యకుమారి సినిమాల్లోకి వచ్చి తెలుగు, తమిళ, కన్నడ, హిందీ నాలుగు భాషల్లోనూ మొత్తం ఇరవై ఆరు సినిమాల్లో నటించింది. విప్రనారాయణ' ఆమె తొలిచిత్రం. అదృష్టం, జయప్రద దేవత, చంద్రహాసన, దీనబంధు. భక్తపోతన, భాగ్యలక్ష్మి, కృష్ణప్రేమ, గీతాంజలి, అదృష్టదీపుడు, మరదలి పెళ్లి, భక్త రామదాసు తదితర తెలుగు చిత్రాల్లో ఉడన్', 'ఖటోలా' తదితర హిందీ చిత్రాల్లో, 'కటకం', 'నేంసారనౌక మొదలైన తమిళ చిత్రాల్లో నటించింది. అలాగే కన్నడ చిత్రం భారతి'లో, ఆంగ్ల చిత్రం 'బాంటే వయిటి లోనూ నటించింది. సూర్యకుమారి, లండన్లో నాట్య ప్రదర్శనలు నిర్వహిస్తూ, కాళికాదేవిగా నాటకాల్లో నటించేది. లలిత గీతాలు యాభై, దేశభక్తిగీతాలు యాభై మొత్తం నూరు గ్రామఫోను రికార్డులు ఇచ్చింది. అలాగే ఒక యాభై దాకా తెలుగు, తమిళ, కన్నడ, హిందీ భాషల సినిమాల్లో తన గొంతుతో పాడిన పాటల రికార్డులు ఉన్నాయి. నటన కంటే సూర్యకుమారి పాడిన దేశభక్తి గీతాలు, లలితగీతాలు, అష్టపదులు వంటివాటికి ఎక్కువ ప్రజాదరణ లభించడంచేత ఆమె పాట కచ్చేరీలు తరుచూ చేస్తూండేది. ఆంధ్రలోని చాలా ఊళ్ళలో లలిత సంగీత కచ్చేరీలు చేసింది.



పేరు ప్రతిష్టలు, ప్రజాదరణ ఆమెకు తృప్తినివ్వలేదు. ఏదో ప్రత్యేక కృషి చెయ్యాలన్న తపన, మూడు నాలుగేళ్ళపాటు కరతాళ ధ్వనులకు, ప్రశంసలకు దూరంగా ఉండి, చదువుమీద దృష్టి కేంద్రీకరించి, ప్రైవేటుగా కేంబ్రిడ్జి సీనియర్ పరీక్ష వ్రాసి, ప్రథమశ్రేణిలో పాసైంది. పలు భాషా చిత్రాలలో నటించిన సూర్యకుమారి మంచి గాయకురాలు కూడా. స్వాతంత్ర్యోద్యమ సమయములో మా తెలుగు తల్లికి మల్లెపూదండ, దేశమును ప్రేమించుమన్నా మొదలైన అనేక దేశభక్తి గీతాలు పాడింది. ప్రకాశం పంతులు ఆమె కళాభిరుచిని బాగా ప్రోత్సహించి, శాస్త్రీయ సంగీతం నేర్పించాడు. ఆయన ఏ సభకు వెళ్ళినా ఆమెను తీసుకెళ్ళి జాతీయ గీతాలు పాడించేవాడు. 1953 అక్టోబరు 1న ఆంధ్ర రాష్టావతరణ సభలో నెహ్రూ, రాజాజీ, ప్రకాశం ప్రభృతుల సమక్షంలో , వందే మాతరం, మా తెలుగు తల్లికి మల్లె పూదండ పాటలు ఆలపించి అందర్నీ సంభ్రమాశ్చర్యాలలో ముంచెత్తింది. వీటితో పాటు 'స్వప్నజగతిలో ఛాయావీణ' మొదలైన లలిత గీతాలు, అడవి బాపిరాజు 'ప్రభువుగారికీ దణ్ణం పెట్టూ', 'రావోయి చిన్నవాడా' మొదలైన జానపద గీతాలు కూడా పాడుతుండేది. హెచ్.ఎం.వి. తదితర గ్రామఫోన్ కంపెనీలు ఈమె పాటలను రికార్డు చేశాయి. ఆమె పాడిన పాటలు గ్రాంఫోన్ రికార్డులుగా వెలువడి విరివిగా అమ్ముడు పోయేవి. ప్రత్యేకంగా రాయించుకున్న పాటలు ఆమెతో పాడించి మరీ గ్రామఫోన్ రికార్డులుగా తీసుకురావడానికి అప్పటి గ్రాంఫోన్ కంపెనీ హెచ్.ఎం.వి. విశేష ఆసక్తి ప్రదర్శించేది, అలా ఆమె పాడిన పాటల్లో జాతీయ గీతాలు, భావగీతాలు, అష్టపదులు ఇలా చాలా రకాలు ఉన్నాయి. శంకరంబాడి సుందరాచారి రచించిన 'మా తెలుగుతల్లికి మల్లె పూదండ..' పాటని ఆమె పెదతండ్రి టంగుటూరి ప్రకాశం పంతులుతో వివిధ రాజకీయ సభల్లో పాడి ప్రాచుర్యం తెచ్చింది. ఆ సభల్లో వక్తగానూ ఆమెకు పేరుండేది. వెండి కంచాలలో వేడి బువ్వుందోయ్, పసిడి కంచాలలో పాల బువ్వుందోయ్, తిందాము రావోయ్ జాబిలి, ఆడుకుందాము రావోయ్ జాబిలీ' అంటూ నటిస్తూ పాడిన 'దేవత' చిత్రంలోని పాట, నారదుడుగా 'శ్రీకృష్ణ ప్రేమ'లో నటిస్తూ 'రేపే వస్తాడంట గోపాలుడు మాపే వస్తాడంట గోపాలుడు...' ఇలా చాలా పాటలు ప్రజాదరణ పొందాయి. 1958లో భారత చలనచిత్ర పరిశ్రమ ప్రతినిధుల బృందంలో ఒక ప్రతినిధిగా అమెరికాను సందర్శించి, తన ఉపన్యాసాలతో ఆకట్టుకుంది. అలా వారితో ఏర్పడిన సంబంధాలు 1959లో కొలంబియా యూనివర్సిటీ ట్యూటర్ గా వెళ్లి, పాశ్చాత్య సంగీతం, పాశ్చాత్య నృత్యాల్లో శిక్షణ పొంది వచ్చింది. సూర్యకుమారి శ్రీ ఆరోజుల్లోనే హాలీవుడ్ కి వెళ్లి ప్రముఖ దర్శకుడు ఆల్ ఫ్రెడ్ హిచ్ కాక్ వద్ద పని చేసింది. ఇంగ్లండ్లో స్థిరపడి ప్రముఖ పెయింటర్ హెరాల్డ్ ఎల్విన్ ను వివాహం చేసుకుని ఇండియా పెర్ఫార్మింగ్ ఆర్ట్స్' అనే సంగీత నాట్య పాఠశాలను నిర్వహించింది. ఇందులో భారతీయ పాశ్చాత్య కళలను, కళాకారుల ప్రదర్శనలు ఏర్పాటు చేయడం, పరస్పర సదవగాహన పెంపొందించం ముఖ్య ఆశయం. 1968లో ఆమె కృషిని బ్రిటిషు రాణి గుర్తించింది. 1969లో గాంధీజీ శతజయంతి ఉత్సవాల సందర్భంగా మహాత్మా గాంధీకి నివాళులర్పిస్తూ సెయింట్ పాల్ కెథెడ్రల్ లో గానం చేసిన ప్రథమ భారతీయ వనిత ఆమె. నార్వే, స్వీడన్, హాలెండ్, స్పెయిన్, కెనడా, అమెరికా మొదలైన పలు దేశాలలో భారతీయ సంగీత శిక్షణాలయాలు నెలకొల్పి, వందలాది కళాకారులను తయారు చేసింది. అమెరికాలో బ్రాడ్వే థియేటరులో విశ్వకవి రవీంద్రుని 'కింగ్ ఆఫ్ ది డార్క్ ఛాంబర్' నాటకంలో రాణి పాత్ర ధరించి, బ్రాడ్వే అవార్డు పొందిన మొదటి భారతీయ నటి. ఆ నాటకాన్ని న్యూయార్కులో ఎనిమిది నెలలపాటు ప్రదర్శించి, అటు తరువాత ఆఫ్రికాలో నాలుగు నెలలు పర్యటించింది. రవీంద్రనాథ్ ఠాగూర్ రాసి 'ది కింగ్ ఆఫ్ ది డార్క్ ఛాంజర్' నాటకంలో నటించింది. ఆ నాటకానికి దేశ విదేశాలలో విశేష ఆదరణ లభించడమే కాకుండా విదేశీయుల అభిమానాన్ని కూడా చూర గొ నే అవకాశం కలిగింది. కొలంబియా యూనివర్సిటీలో, లండను యూనివర్సిటీ విద్యాసంస్థలలో, బ్లాక్ థియేటరులోను భారతీయ నృత్యకళ సంగీతంపై వర్క్ షాపులు నిర్వహించింది. 1975లో హైదరాబాదులో జరిగిన ప్రపంచ తెలుగు మహాసభ ఆమె సేవలను గుర్తించి సత్కరించింది. 1979లో రాజ్యలక్ష్మి అవార్డుతో ఆమెను గౌరవించింది. ఆమె ఏప్రిల్ 25, 2005 న లండనులో మరణించింది.



# 14 రోజులపాటు రోజూ ఒక కోడిగుడ్డును తింటే శరీరంలో కనిపించే మార్పులు ఇవే..!

గుడ్లు రోజువారీ ఆహారంలో అత్యంత సాధారణంగా ఉపయోగించే పదార్థాల్లో ఒకటి. వీటిని తేలికగా వండుకోవచ్చు, ఎన్నో వంటకాలతో కలిపి తినవచ్చు, ముఖ్యంగా ప్రొటీన్ కోసం చాలా మంది గుడ్లపై ఆధారపడుతుంటారు. కొందరికి ఇవి ప్రతి రోజు బ్రేక్‌ఫాస్ట్‌లో తప్పనిసరి కాగా, మరికొందరికి కొలెస్ట్రాల్ గురించి సందేహాలు ఉంటాయి. అయితే గుడ్లు కేవలం సులభమైన ఆహారమే కాదు, ఇవి శరీరానికి అవసరమైన అనేక పోషకాలను కలిగి ఉంటాయి. మెదడు పనితీరు, శక్తి స్థాయిలు, చర్మం, జుట్టు, కంటి ఆరోగ్యం వంటి అంశాల్లో కూడా గుడ్లు ముఖ్య పాత్ర పోషిస్తాయి. ఇక 14 రోజుల పాటు గుడ్లను ప్రతిరోజూ తింటే శరీరంలో కొన్ని మార్పులు కనిపిస్తాయని నిపుణులు తెలియజేస్తున్నారు.

**మెదడు పనితీరుకు, కళ్ల ఆరోగ్యానికి..**

మొదటగా మెదడు పనితీరు మెరుగుపడుతుంది. గుడ్లలో కోలిన్ అనే పోషకం అధికంగా ఉంటుంది. ఇది మెదడులో అసెటైల్కోలిన్ అనే న్యూరోట్రాన్స్‌మిటర్ తయారీలో సహాయపడుతుంది. ఇది జ్ఞాపకశక్తి, ఏకాగ్రతను మెరుగుపరచడంలో సహకరిస్తుంది. రెండవది, కొలెస్ట్రాల్ సమతుల్యం మెరుగుపడే అవకాశం ఉంటుంది. గుడ్లు కొలెస్ట్రాల్ పెంచుతాయని భావన ఉన్నప్పటికీ, చాలా మందిలో ఇవి హెచ్‌డీఎల్ (మంచి కొలెస్ట్రాల్) స్థాయిలని పెంచడంలో సహాయపడతాయని నిపుణులు చెబుతున్నారు. ఇది గుండె ఆరోగ్యానికి ఉపయోగకరం. మూడవది, కంటి ఆరోగ్యానికి గుడ్లు మేలు చేస్తాయి. గుడ్ల పచ్చసొనలో లుటీన్, జియాజాంతిన్ అనే యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవి హానికరమైన బ్లూ లైట్ నుంచి కళ్లను రక్షించడంలో సహాయపడతాయి. దీర్ఘకాలికంగా కంటి ఆరోగ్యాన్ని కాపాడుతాయి.

**జుట్టు, చర్మం సంరక్షణకు..**

నాలుగవది, జుట్టు, చర్మం, గోర్లు ఆరోగ్యంగా ఉండటానికి గుడ్లు సహాయపడతాయి. గుడ్లలో సల్ఫర్ కలిగిన అమినో ఆమ్లాలు ఉంటాయి. ఇవి కెరాటిన్ అనే ప్రొటీన్ తయారీలో కీలక పాత్ర పోషిస్తాయి. దీంతో జుట్టు బలంగా, చర్మం ఆరోగ్యంగా, గోర్లు దృఢంగా మారుతాయి. ఇలా 14 రోజుల పాటు గుడ్లు తీసుకోవడం వల్ల శరీరంలో అనేక మంచి మార్పులు జరుగుతాయి. ఇక గుడ్లు తినని వారు కూడా ప్రత్యామ్నాయంగా కొన్ని ఆహారాలను తీసుకోవచ్చు. వెజిటేరియన్ల కోసం సోయా ఆధారిత ఆహారాలు మంచి ఎంపిక అని నిపుణులు సూచిస్తున్నారు. టోఫు, టెంపె, ఎడమామే వంటి పదార్థాలు గుడ్లకు దగ్గరైన ప్రొటీన్ వనరులుగా పనిచేస్తాయి. సమతుల ఆహారంలో భాగంగా గుడ్లను తీసుకుంటే అవి శరీరానికి అనేక విధాలుగా మేలు చేస్తాయి. మెదడు పనితీరు, గుండె ఆరోగ్యం, మొత్తం ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో గుడ్లు ఉపయోగకరంగా ఉంటాయని నిపుణులు తెలియజేస్తున్నారు.


# ఏబీసీ జ్యూస్, గ్రీన్ జ్యూస్. ఇవి శరీరానికి ఏవిధంగా మేలు చేస్తాయి?



వేసవి కాలంలో జ్యూసింగ్ ఒక ట్రెండ్ మాత్రమే కాకుండా ఇప్పుడు అనేక మందికి తప్పనిసరి అలవాటుగా మారింది. ఎర్రటి రంగులో కనిపించే ఏబీసీ (ఆపిల్, బీట్‌రూట్, క్యారెట్) జ్యూస్ అయినా, గాఢమైన ఆకుపచ్చ రంగులో ఉండే గ్రీన్ జ్యూస్ అయినా.. రెండూ జీర్ణక్రియకు మంచివని భావిస్తారు. అయితే ఈ జ్యూసులు నిజంగా గట్ మైక్రోబయోమ్ (జీర్ణ వ్యవస్థలోని మంచి బ్యాక్టీరియా)కు ఎంతవరకు ఉపయోగపడతాయి? ప్రస్తుతం నగర జీవనశైలిలో పెరుగుతున్న జీర్ణ సమస్యలు, బ్లోటింగ్ (కడుపు ఉబ్బరం) నుంచి ఇరిటబుల్ బౌల్ సిండ్రోమ్ (ఐబీఎస్) వరకు ఈ రెండు జ్యూసుల మధ్య ఉన్న తేడాలను అర్థం చేసుకోవడం అవసరమని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. మొదటగా ఏబీసీ జ్యూస్ అంటే ఆపిల్, బీట్‌రూట్, క్యారెట్ కలయిక. ఇది ఆరోగ్యానికి ఎంతో ఉపయోగకరమని ప్రచారం పొందింది. మరోవైపు గ్రీన్ జ్యూస్ అనేది పాలకూర, కేల్, దోసకాయ, సెలరీ వంటి ఆకుకూరలతో తయారవుతుంది. దీనిలో కొద్దిగా నిమ్మరసం లేదా అల్లం కూడా కలుపుతారు.రక్త ప్రసరణ మెరుగుదలకు..ఒకటి భూమిలో పెరిగే వేరుజాతి పదార్థాలపై ఆధారపడితే, మరొకటి ఆకుకూరలలోని క్లోరోఫిల్, నీటి శాతం ఎక్కువగా ఉండే పదార్థాలపై ఆధారపడి ఉంటుంది. ఏబీసీ జ్యూస్ గట్ ఆరోగ్యానికి ప్రీ-బయోటిక్ శక్తిగా పనిచేస్తుంది. ఆపిల్‌లో ఉండే పెక్టిన్ అనే ఫైబర్ మంచి బ్యాక్టీరియా పెరుగుదలకు సహాయపడుతుంది. బీట్‌రూట్‌లోని బెటలైన్స్ యాంటీ ఆక్సిడెంట్స్‌గా పనిచేసి రక్తప్రసరణను మెరుగుపరుస్తాయి, తద్వారా జీర్ణ వ్యవస్థకు ఆక్సిజన్ సరఫరా బాగుంటుంది. క్యారెట్‌లోని బీటా కెరోటిన్ విటమిన్-ఏ గా మారి జీర్ణాశయంలోని పొరను రక్షిస్తుంది. ఈ కారణంగా ఏబీసీ జ్యూస్ నెమ్మదిగా జీర్ణమయ్యే వారికి, తక్కువ ఎనర్జీ ఉన్న వారికి, లివర్ ఆరోగ్యాన్ని మెరుగుపరచుకోవాలనుకునేవారికి ఉపయోగపడుతుంది.జీర్ణ సమస్యలు తగ్గేందుకు..ఇక గ్రీన్ జ్యూస్ ప్రధానంగా శరీరాన్ని చల్లబరచే, ఇన్‌ఫ్లమేషన్ (వాపు) తగ్గించే లక్షణాలతో ఉంటుంది. ఆకుకూరలలోని క్లోరోఫిల్ శరీరంలో టాక్సిన్స్‌ను తగ్గించి ఆల్కలైన్ బ్యాలెన్స్‌ను మెరుగుపరుస్తుంది. పాలకూరలో ఉండే మెగ్నీషియం కండరాలను రిలాక్స్ చేసి పొట్ట కండరాల నొప్పులను తగ్గిస్తుంది. దోసకాయ, సెలరీ వంటి పదార్థాలు శరీరానికి ఎలక్ట్రోలైట్స్ అందించి హైడ్రేషన్ పెంచుతాయి. అల్లం జీర్ణక్రియను వేగవంతం చేసి గ్యాస్, ఆసిడ్ రిఫ్లక్స్ సమస్యలను తగ్గిస్తుంది. గ్రీన్ జ్యూస్ ముఖ్యంగా బ్లోటింగ్, ఆసిడిటీ సమస్యలతో బాధపడేవారికి ఉపయోగకరంగా ఉంటుంది. అయితే, జ్యూసింగ్‌లో ఒక ముఖ్యమైన లోపం ఫైబర్ తగ్గిపోవడం. పండ్లు, కూరగాయలను జ్యూస్ చేస్తే వాటిలోని పల్ప్ తొలగిపోతుంది. ఇదే పల్ప్ గట్ ఆరోగ్యానికి కీలకం. ఫైబర్ లేకపోవడం వల్ల రక్తంలో గ్లూకోజ్ స్థాయిలు త్వరగా పెరుగుతాయి. దీని వల్ల గట్ బ్యాక్టీరియా సమతుల్యత దెబ్బతినే ప్రమాదం ఉంది. అందుకే ఒక పండు కోసం మూడు కూరగాయల నిష్పత్తి పాటించడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు.దేన్ని తాగాలి..ఇక ఏ జ్యూస్ మంచిదనే ప్రశ్నకు ఒకే సమాధానం లేదు. గట్ లైనింగ్‌ను బలపరచుకోవాలని అనుకుంటే ఏబీసీ జ్యూస్ ఉత్తమం. ఇన్‌ఫ్లమేషన్, బ్లోటింగ్ తగ్గించుకోవాలంటే గ్రీన్ జ్యూస్ మంచిది. రెండింటినీ విడతలవారీగా తీసుకోవడం ఉత్తమమైన పద్ధతి. ఉదాహరణకు, మూడు రోజులు ఏబీసీ జ్యూస్ తీసుకుని, తరువాత మూడు రోజులు గ్రీన్ జ్యూస్ తీసుకుంటే గట్ మైక్రోబయోమ్‌కు వైవిధ్యం లభిస్తుంది. అయితే ఇది సాధారణ ఆరోగ్యంతో ఉన్నవారికి మాత్రమే వర్తిస్తుందని, ఇప్పటికే ఏదైనా ఆరోగ్య సమస్య ఉన్నవారు తప్పనిసరిగా పోషకాహార నిపుణులను

# పేగుల్లో మంచి బ్యాక్టీరియా: కేవలం జీర్ణక్రియకే కాదు..

## ఈ ఆరోగ్య ప్రయోజనాల కోసం కూడా తప్పనిసరి!



పేగుల్లో మంచి బ్యాక్టీరియా కేవలం జీర్ణ వ్యవస్థకే కాదు, వీటికి కూడా అవసరమే..! ఇప్పటికే చాలా మందికి ప్రోటీన్ తీసుకోవడం, స్ట్రెంగ్త్ ట్రైనింగ్, ఎక్కువ కాలరీలు తీసుకోవడం కండరాల పెరుగుదలకు ముఖ్యమని తెలుసు. అయితే, ఇటీవల జరిగిన ఒక అధ్యయనం కండరాల శక్తి, శారీరక పనితీరును ప్రభావితం చేసే మరో ముఖ్య అంశాన్ని గుర్తించింది. పేగుల్లో మంచి బ్యాక్టీరియా కేవలం జీర్ణ వ్యవస్థకే కాదు, వీటికి కూడా అవసరమే..!ఇప్పటికే చాలా మందికి ప్రోటీన్ తీసుకోవడం, స్ట్రెంగ్త్ ట్రైనింగ్, ఎక్కువ కాలరీలు తీసుకోవడం కండరాల పెరుగుదలకు ముఖ్యమని తెలుసు. అయితే, ఇటీవల జరిగిన ఒక అధ్యయనం కండరాల శక్తి, శారీరక పనితీరును ప్రభావితం చేసే మరో ముఖ్య అంశాన్ని గుర్తించింది. పేగుల్లో ఉండే ఒక ప్రత్యేకమైన మంచి బ్యాక్టీరియా కండరాల బలం పెంచడంలో నేరుగా సహాయపడుతుందని ఈ పరిశోధన వెల్లడించింది. ఇది గట్-మసిల్ యాక్సిస్ అనే కొత్త భావనకు బలమైన ఆధారాలను అందిస్తోంది. అంటే పేగులలోని సూక్ష్మజీవుల వాతావరణం కండరాల పనితీరును ప్రభావితం చేస్తుంది. గట్-మసిల్ యాక్సిస్ అనేది జీర్ణవ్యవస్థ (గాస్ట్రోఇంటెస్టినల్ ట్రాక్ట్), కండరాల మధ్య ఉండే ద్విముఖ సంబంధం. పేగుల ఆరోగ్యం కండరాల పరిమాణం, పనితీరును ప్రభావితం చేస్తుంది. అదే సమయంలో శారీరక వ్యాయామం కూడా పేగులలోని మంచి బ్యాక్టీరియా వృద్ధి చెందేందుకు దోహదపడుతుంది.గట్ అనే జర్నల్‌లో ప్రచురితమైన ఈ అధ్యయనం ప్రకారం రోసిబ్యూరియా ఇనులినివోరాన్స్ అనే మంచి బ్యాక్టీరియా కండరాల పనితీరుకు సహజ బూస్టర్‌లా పనిచేస్తుందని వెల్లడైంది. ఇది కేవలం ఆహారాన్ని జీర్ణం చేయడమే కాకుండా, కండరాలు నిర్మాణం అయ్యేందుకు, సమర్థవంతంగా పనిచేయడానికి సంకేతాలు పంపుతుంది. ఇక ఈ పరిశోధనల్లో కొన్ని ముఖ్యాంశాలను కూడా పరిశోధకులు గుర్తించారు. వృద్ధుల్లో ఈ బ్యాక్టీరియా ఎక్కువగా ఉన్నవారికి హ్యాండ్‌గ్రిప్ శక్తి దాదాపు 30 శాతం ఎక్కువగా కనిపించిందని గుర్తించారు. యువతలో ఈ బ్యాక్టీరియా శక్తి మాత్రమే కాకుండా స్టామినా పెరుగుదలతో కూడా సంబంధం కలిగి ఉంది. ఎలుకలపై చేసిన పరీక్షల్లో ఈ బ్యాక్టీరియా ఇచ్చిన గ్రూప్‌లో గ్రిప్ శక్తి 30 శాతం పెరిగింది. మనుషుల్లో కూడా ఈ బ్యాక్టీరియా అధికంగా ఉన్నవారికి లెగ్ ప్రెస్, బెంచ్ ప్రెస్ వంటి వ్యాయామాల్లో మెరుగైన ఫలితాలు కనిపించాయి.కండరాలకు శక్తిని ఇస్తుంది..ఇక ఈ బ్యాక్టీరియా శరీరంలో అమినో ఆమ్లాల వినియోగాన్ని మార్చుతుంది. ఇది కండరాలకు అవసరమైన శక్తి మార్గాలను యాక్టివేట్ చేసి, కండర కణాలు అధిక శక్తిని ఉత్పత్తి చేసుకునేలా సహాయపడుతుంది. సాదారణంగా చెప్పాలంటే ఇది కండరాలకు ఇంధనం అందించే విధానాన్ని మెరుగుపరుస్తుంది. పేగుల్లో లక్షల కోట్ల సూక్ష్మజీవులు (మైక్రోబయోమ్) ఉంటాయి. వీటిలో రోసిబ్యూరియా వంటి మంచి బ్యాక్టీరియా ఎక్కువగా ఉన్నవారు, వ్యాయామం తక్కువ చేసినా కూడా సహజంగా బలంగా ఉండే అవకాశం ఉందని శాస్త్రవేత్తలు గుర్తించారు.పేగుల ఆరోగ్యం మెరుగైతే..పేగుల ఆరోగ్యం మెరుగైతే కండరాల శక్తి కూడా మెరుగవుతుంది. అందుకే కొన్ని అలవాట్లు పాటించడం ద్వారా గట్ మసిల్ యాక్సిస్‌ను మెరుగుపరుచుకోవచ్చు. దీని కోసం ఫైబర్ అధికంగా ఉండే ఆహారం తీసుకోవాలి. ఇది మంచి బ్యాక్టీరియా పెరుగుదలకు దోహదపడుతుంది. క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలి. ఇది మైక్రోబయోమ్ వైవిధ్యాన్ని పెంచుతుంది. ప్రోబయోటిక్స్, ప్రీబయోటిక్స్ ఆహారంలో చేర్చాలి. ఇవి పేగుల సమతుల్యతను మెరుగుపరుస్తాయి. ఈ పరిశోధన ఒక ముఖ్యమైన విషయాన్ని చెబుతోంది. కండరాల పెరుగుదల కేవలం ప్రోటీన్ షేక్స్ లేదా బరువులు ఎత్తడంపైనే ఆధారపడదు. పేగుల ఆరోగ్యాన్ని మెరుగుపరిచే ప్రోబయోటిక్స్ కూడా కండరాల బలం పెంచడంలో కీలక పాత్ర పోషిస్తాయని నిపుణులు తెలియజేస్తున్నారు.

# వేసవి కాలంలో అమృతం 'చెరకు రసం'..

**డీహైడ్రేషన్, ఎండదెబ్బకు చెక్ పెట్టాలంటే ఇది తాగాల్సిందే!**



వేసవి కాలంలో ఉష్ణోగ్రతలు పెరిగే కొద్దీ శరీరాన్ని చల్లబరచేందుకు చాలా మంది సహజంగానే చల్లని పానీయాలవైపు మొగ్గు చూపుతారు. నిమ్మరసం (నీంబూ పానీ), చల్లని లస్సీలు వంటి సంప్రదాయ పానీయాలు తక్షణ ఉపశమనం ఇస్తాయని భావిస్తారు. ఈ జాబితాలో చెరకు రసం (షుగర్‌కేన్ జ్యూస్) కూడా ప్రముఖంగా ఉంటుంది. ఇది సహజంగా తీయగా, తాజాగా అనిపించడంతోపాటు శరీరాన్ని చల్లబరుస్తుందని చాలామంది నమ్మకం. అయితే తీవ్రమైన ఎండలో ఇది నిజంగా హీట్ స్ట్రోక్‌ను నివారిస్తుందా? శరీరానికి అవసరమైన హైడ్రేషన్‌ను అందిస్తుందా? అనే విషయాలపై చెరకు రసం గురించి కొన్ని అపోహలు ఉన్నాయి. వాటిని వైద్యులు వివరిస్తున్నారు. హైడ్రేషన్ జరుగుతుందా..హీట్ స్ట్రోక్ అనేది శరీరం తన ఉష్ణోగ్రతను నియంత్రించలేని ప్రమాదకర పరిస్థితి. ఇది ముఖ్యంగా డీహైడ్రేషన్, ఎలక్ట్రోలైట్ లోపం వల్ల వస్తుంది. చెరకు రసం తాగితే చల్లగా అనిపించినా, ఇది హీట్ స్ట్రోక్‌ను నివారించడానికి అవసరమైన ముఖ్య పోషకాలను అందించదు. చెరకు రసం ఎలక్ట్రోలైట్ డ్రింక్‌లా పనిచేస్తుందని ఒక పెద్ద అపోహ ఉంది. వాస్తవానికి చెమట ద్వారా శరీరం ఒక లీటర్‌కు సుమారు 900 మిల్లీగ్రాముల సోడియంను కోల్పోతుంది. కానీ ఒక గ్లాస్ చెరకు రసంలో కేవలం 11-17 మిల్లీగ్రాముల సోడియం మాత్రమే ఉంటుంది. సోడియం శరీరంలో నీటిని నిల్వ ఉంచడంలో కీలకం. ఇది తక్కువగా ఉంటే హైడ్రేషన్ పూర్తిగా జరగదు. అందుకే చెరకు రసం తాగడం అంటే అసలు శరీరాన్ని హైడ్రేట్ చేయడం కాకుండా చక్కెర నీరు తాగినట్లే అవుతుందని నిపుణులు చెబుతున్నారు. దీనికంటే కొంచెం ఉప్పు కలిపిన నిమ్మరసం తాగడం ఎంతో మేలు చేస్తుంది.అధికంగా చక్కెర..ఇంకో ముఖ్య అంశం చక్కెర పరిమాణం. ఒక గ్లాస్ చెరకు రసంలో సుమారు 25 నుంచి 40 గ్రాముల వరకు చక్కెర ఉంటుంది. ఇది రక్తంలో గ్లూకోజ్ స్థాయిలను ఒక్కసారిగా పెంచే ప్రమాదం ఉంటుంది. ముఖ్యంగా ఖాళీ కడుపుతో తాగితే ఇది మరింత ప్రభావం చూపుతుంది. తాత్కాలికంగా శక్తి ఇచ్చినా, దీర్ఘకాలికంగా హైడ్రేషన్‌కు పెద్దగా సహాయపడదు. హైజీన్ కూడా చెరకు రసం విషయంలో పెద్ద సమస్యగా మారుతుంది. రోడ్డుపై అమ్మే జ్యూస్ స్టాళ్లు ఎక్కువసేపు ఎండలో ఉంటాయి. యంత్రాలు సరిగ్గా శుభ్రం చేస్తారని నమ్మకం ఉండదు. వాడే ఐస్ కూడా శుద్ధి చేసిన నీటితో తయారై ఉండదు. ఈ కారణాల వల్ల ఈ.కోలి, టైఫాయిడ్, జాండిస్ వంటి ఇన్ఫెక్షన్లు వచ్చే ప్రమాదం ఉంటుంది.ఉప్పు, నిమ్మరసం కలిపిన నీళ్లు బెటర్..అయితే వేసవిలో ఏం తాగాలి? అంటే.. నిపుణుల సూచన ప్రకారం సాదాసీదా నీరు అత్యుత్తమం.

# కార్మికుల డిమాండ్లను వెంటనే పరిష్కరించాలి

**సమ్మె కార్మికుల హక్కు**
**మాజీ మంత్రి జీవన్ రెడ్డి**




**జగిత్యాల:** డిమాండ్ల పరిష్కారం కోసం సమ్మెలు నిర్వహించడం కార్మికుల హక్కు అని మాజీ మంత్రి, టిఆర్ఎస్ పార్టీ కార్యదర్శి జీవన్ రెడ్డి అన్నారు. పట్టణంలోని ఆర్టీసీ డిపో ఎదుట కార్మికులు నిర్వహిస్తున్న సమ్మెకు మద్దతు తెలిపారు. మాజీ మంత్రి, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీవన్ రెడ్డి మాట్లాడుతూ కార్మికులు సమ్మెకు పోవడం దురదృష్టకరం అని ఆయన అన్నారు. ప్రభుత్వ నిర్లక్షం వల్లనే ఈ పరిస్థితి వచ్చిందన్నారు. గత ప్రభుత్వం ఆర్టీసీ ని ప్రభుత్వంలో విలీనం చేయాలని చర్చించారు. గతంలో ఆర్టీసీ విలీన ప్రతిపాదన శాసన సభలో శాసన మండలిలో ఏకగ్రీవ ఆమోదం తెలుపడం జరిగిందని వెల్లడించారు. గతంలో ఉద్యమ బలోపేతం గురించి ప్రధాన పాత్ర పోషించిందని కార్మికులు పేర్కొన్నారు. ఈ ప్రభుత్వం ఆర్టీసి సమస్యలపైన ఎందుకు జాప్యం చేస్తుందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థ దీనిని బలోపేతం చేసుకోవాలన్నారు. మహాలక్ష్మి పథకం అమలు కారణం ఆర్టీసి సంస్థ కార్మికులు అన్నారు. ఆక్యుపెన్సీ పెరిగింది బస్ ల సంఖ్య పెంచాలి కాని ఉన్న బస్ డిపో లను తీసి వేస్తున్నట్లు విమర్శించారు. ఆర్టీసీ డ్రైవర్ శంకర్ గౌడ్ మరణం ప్రభుత్వానికి చెంప పెట్టు అని, కార్మికులు రోడ్ ఎక్కడానికి రేవంత్ రెడ్డి పరోక్షంగా కారణం అని మండిపడ్డారు. ప్రభుత్వ ఆస్తులు అమ్మకమే రేవంత్ రెడ్డి ఆదాయం అని, ఆర్టీసి సంస్థను ప్రైవేటీకరణ చేయడమే ఈ ప్రభుత్వ లక్ష్యంగా ఉందన్నారు. ఇందుకు మంత్రి పొన్నం ప్రభాకర్ కూడా ఇందులో బాధ్యుడని ఆరోపించారు. వేతన భత్యాల సవరణ రాజ్యాంగం కల్పించిన హక్కు అని ఆయన అన్నారు. ఎలక్ట్రిక్ బస్సులు ఆర్టీసీ సంస్థ కి ఇచ్చినట్లయితే ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయన్నారు. కార్మికుల ఆత్మహుతి బలిదానాలు సమస్యలకు పరిష్కారం కాదని, కార్మికులు సంయమనం పాటించాలని సూచించారు. కార్మికుల డిమాండ్ల పరిష్కారానికి ప్రభుత్వం పైన ఒత్తిడి తేవడానికి బి ఆర్ ఎస్ పార్టీ సిద్ధంగా ఉందన్నారు. ఈ ఉద్యమం శంకర్ గౌడ్ మరణం ఆనాటి శ్రీకాంత చారి బలిదానం తలపిస్తుందన్నారు. శంకర్ గౌడ్ కుటుంబానికి కోటి రూపాయల పరిహారంతో పాటు కుటుంబంలో ఉద్యోగం ఇవ్వాలన్నారు. శంకర్ గౌడ్ మృతితో రేవంత్ రెడ్డి కండ్లు తెరవాలని,ఈ రోజు చర్చలు కాదు సమస్యలకు పరిష్కారం కావాలన్నారు. గత ఎన్నికల్లో ఈ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ఆర్టీసీ కార్మికులకు సంస్థకు ఏమి హామీలు ఇచ్చిందో చదువుకోవాలని హితవు పలికారు. శంకర్ గౌడ్ మరణం చాలా బాధ అనిపించిందని, ఇది పునరావృతం కాకూడదన్నారు. శంకర్ గౌడ్ కుటుంబానికి కార్మికుల పక్షాన కూడా తోడుగా ఉండాలని సూచించారు. కార్మికుల సమస్యలను అన్నింటిని ఈ ప్రభుత్వం పరిష్కరించాలన్నారు. ఇప్పుడూ యూనియన్ల అవసరం ఉంది యూనియన్ల పునరుద్ధరణ చేయాలని తెలిపారు. శంకర్ గౌడ్ ఆత్మకి శాంతి చేకురాలి వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని జీవన్ రెడ్డి డిమాండ్ చేశారు.

# అధికారికంగా వాసవి మాత జయంతి ఆర్యవైశ్యులకు గర్వకారణం

**సీఎం,మంత్రి, చైర్మన్ లకు పాలభిషేకం చేసిన ఆర్యవైశ్యులు**
**తెలంగాణ ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర కార్యదర్శి కొత్త శ్రీనివాస్ గుప్తా**



**మక్తల్:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి మాత జయంతి వేడుకలను అధికారికంగా నిర్వహించేందుకు నిర్ణయం తీసుకొని ఉత్తర్వులు జారీ చేయడం ఆర్యవైశ్యులందరికి గర్వకారణం అని తెలంగాణ ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర కార్యదర్శి, శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయం మక్తల్ చైర్మన్ కొత్త శ్రీనివాస్ గుప్తా అన్నారు.వాసవి జయంతిని అధికారికంగా నిర్వహించేందుకు నిర్ణయం తీసుకోవడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,స్థానిక ఎమ్మెల్యే రాష్ట్ర పశుసంవర్ధక క్రీడల శాఖ మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి తో పాటు రాష్ట్ర మంత్రివర్గానికి, ఆర్య వైశ్య కార్పొరేషన్ చైర్మన్ కల్వ సుజాత కు ఆర్యవైశ్యుల పక్షాన ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తూ అలాగే గాంధీ విగ్రహానికి పూలమాల వేసి అనంతరం సీఎం రేవంత్ రెడ్డికి,మంత్రి వాకిటి శ్రీహరికి,ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కల్వ సుజాతకు ఆర్యవైశ్య నాయకులు పాలభిషేకం చేశారు.శుక్రవారం నారాయణ పేట జిల్లా మక్తల్ పట్టణంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం అక్కడే ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆర్యవైశ్యుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా వ్యవహరిస్తూ అమ్మవారి జయంతి వేడుకలను అధికారికంగా నిర్వహించేందుకు నిర్ణయం తీసుకోవడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఆర్యవైశ్యులంతా ప్రభుత్వానికి రుణపడి ఉంటామని అన్నారు. ప్రజలందరితో మమేకమై సేవా కార్యక్రమాలలో ముందుండే ఆర్యవైశ్యుల పట్ల పాలక ప్రభుత్వం సానుకూలంగా వ్యవహరించడం జరిగిందన్నారు. రానున్న రోజుల్లో ఆర్యవైశ్య సంఘం,మహిళ సంఘము,వాసవి క్లబ్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున సేవా కార్యక్రమాలు చేపడతామన్నారు.ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్పర్సన్ కల్వ సుజాత ఆర్యవైశ్యుల తరపున చేసిన విజ్ఞప్తికి ముఖ్యమంత్రి ,మంత్రిమండలి సానుకూలంగా నిర్ణయం తీసుకోవడం హర్షనీయమని కొత్త శ్రీనివాస్ గుప్తా పేర్కొన్నారు. మరోమారు ఆయన రాష్ట్ర ముఖ్యమంత్రికి, మంత్రిమండలికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఆర్యవైశ్య సంఘం నాయకులు మాజీ ఉపసర్పంచ్ కట్ట సురేష్ కుమార్ గుప్తా మాట్లాడుతూ ఇటీవల కాలంలో ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్పర్సన్ కల్వ సుజాత ఆధ్వర్యంలో ఎల్ బి స్టేడియంలో నిర్వహించిన వాసవి మాత పారాయణం గిన్నిస్ బుక్ రికార్డు నమోదు చేసుకుందన్నారు . ఈ సందర్భంగా ఆర్యవైశ్యుల విజ్ఞప్తిని మన్నించిన ముఖ్యమంత్రి వాసవి మాత జయంతికి నాలుగు రోజుల ముందే అధికారికంగా వాసవి మాత జయంతి వేడుకలను నిర్వహిస్తూ నిర్ణయం తీసుకొని ఉత్తర్వులు జారీ చేయడం పట్ల ఆర్యవైశ్య సమాజం ప్రభుత్వ నిర్ణయం పట్ల హర్షం వ్యక్తం చేస్తుందని అన్నారు. ఆర్యవైశ్యులంతా రాష్ట్ర ముఖ్యమంత్రి కి రుణపడి ఉంటామని ఆయన పేర్కొన్నారు .ఈనెల 26న వాసవి మాత జయంతి సందర్భంగా మక్తల్ పట్టణంలోని శ్రీ పడమటి ఆంజనేయ స్వామి వారి పుష్కరిణి (కోనేరు) నుండి 108 కళాశాలతో శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయం వరకు శోభాయాత్ర,అభిషేకం, సామూహిక కుంకుమార్చన, అమ్మవారికి ఒడి బియ్యం, అన్నదానం మిగిత కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.ఈ వేడుకల్లో ఆర్యవైశ్యులు ,హిందూ బంధువులు, అధికారులు, ప్రజా ప్రతినిధులు, పట్టణ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. వాసవి జయంతిని అధికారికంగా నిర్వహించేందుకు నిర్ణయం తీసుకున్నాం ముఖ్యమంత్రి, మంత్రులకు కట్ట సురేష్ కుమార్ గుప్తా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమం లో ఆర్యవైశ్య సంఘం పెద్దలు మనసాని వెంకటేష్ గుప్తా బిలకంటి జగదీష్ దొంత నరహరి,మనసాని నాగరాజు, కల్వ శ్రీనివాస్ ఉదయ్, బిలకంటి నరసయ్య ,వాసవి క్లబ్ అధ్యక్షులు మేడిశెట్టి హరికృష్ణ ,వనిత క్లబ్ అధ్యక్షురాలు కల్వాల ప్రసన్న మహిళ సంఘము మజీ అధ్యక్షులు మనసాని సరళ దేవి, పాలుట్ల సుష్మ, చల్ల రూప,తదితరులు పాల్గొన్నారు.

# ఆత్మహత్యలొద్దు.. తెగించి పోరాడుదాం

- ఆర్టీసీ కార్మికులతో తగవుపెట్టుకుంటే పతనం తప్పదు
- యూనియన్లంటే పాలకులకు భయమెందుకు
- ప్రజారవాణాను ప్రైవేటీకరించేందుకు ప్రభుత్వం కుట్ర
- చట్టపరమైన సమ్మెపై నిర్బంధాలు ఆపండి
- డిమాండ్లు పరిష్కరించేవరకు ఆర్టీసీ కార్మికులకు అండగా ఉంటాం
- శంకర్ గౌడ్ మృతికి ప్రభుత్వమే బాధ్యత వహించాలి
- ఎమ్మెల్యే కూనంనేని



**కొత్తగూడెం :** సమస్యల పరిష్కారం కోసం ప్రాణాలు తీసుకోవద్దని, ఆత్మహత్యలు సమస్యకు పరిష్కారం కాదని, తెగించి పోరాడి హక్కులను సాధించుకుందామని కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు పిలుపునిచ్చారు. ఆర్టీసీ కార్మికులు, ఉద్యోగులు తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ చేపట్టిన సమ్మె శుక్రవారం నాటికి మూడో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా బస్టాండ్ ఔట్ గేట్ నుంచి ఇన్ గేట్ వరకు భారీ ప్రదర్శన నిర్వహించి బస్టాండు రోడ్డుపై ధర్నా చేపట్టారు. ధర్నాలో పాల్గొన్న ఎమ్మెల్యే కూనంనేని మాట్లాడుతూ కార్మికులతో పెట్టుకున్న ఏ ప్రభుత్వానికైనా పతనం తప్పదని, ఆర్టీసీ కార్మికులతో తగవుపెట్టుకోవడం పాలకుల వినాశనానికి నాంది పలికే ప్రమాదం ఉందని, గత ప్రభుత్వ తప్పిదమే ప్రస్తుత ప్రభుత్వం చేస్తోందని విమర్శించారు. కార్మిక యూనియన్లంటే పాలకులకు ఎందుకు అంత భయమని, హక్కుల కోసం పోరాడే గొంతులను నొక్కేయాలని చూడటం ప్రజాస్వామ్య విరుద్ధమని మండిపడ్డారు. ప్రజారవాణా వ్యవస్థను నిర్వీర్యం చేసి, కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టేందుకు ప్రభుత్వం కుట్ర పన్నుతోందని, అందులో భాగంగానే ప్రైవేటీకరణ దిశగా అడుగులు వేస్తూ కార్మికులను ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం, ట్రేడ్ యూనియన్లపై ఆంక్షలు ఎత్తివేత, గుర్తింపు సంఘం ఎన్నికలు, వేతన సవరణ, పనిభద్రత, బకాయిలు, పనిభద్రత, కొత్తబస్సుల కొనుగోలు తదితర డిమాండ్లు ప్రభుత్వానికి సాధ్యం కానివికాదని పేర్కొన్నారు. సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా మాట్లాడుతూ చట్టబద్ధంగా సమ్మె చేస్తుంటే అరెస్టులు, అక్రమ నిర్బంధాలు ఎందుకు విధిస్తున్నారని ఆయన ప్రశ్నించారు. ప్రభుత్వం తన మొండివైఖరిని వీడకుండా రాష్ట్రంలో ఎమర్జెన్సీ తరహా పరిస్థితులను తీసుకొస్తోందని ధ్వజమెత్తారు. ఇప్పటికైనా ప్రభుత్వం కళ్ళు తెరిచి ఆర్టీసీ కార్మికుల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించి, సమ్మెను నివారించాలని డిమాండ్ చేశారు. డిమాండ్లు నెరవేరే వరకు తాము ఆర్టీసీ కార్మికులకు పూర్తి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్మికుడు శంకర్ గౌడ్ మృతికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని, తక్షణమే ఆయన కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. నిర్బంధాలు పెరిగే కొద్దీ ఉద్యమం మరింత ఉధృతమవుతుం దని హెచ్చరించారు. కార్యక్రమంలో కొత్తగూడెం మేయర్ మూడ్ గణేష్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కందుల భాస్కర్, కంచర్ల జమలయ్య, సలిగంటి శ్రీనివాస్, మిర్యాల రంగయ్య, ఎస్ కె ఫహీమ్, జిల్లా సమితి సభ్యులు వంగ వెంకట్, కె రత్నకుమారి, నేరెళ్ల రమేష్, భూక్యా శ్రీనివాస్, రమణమూర్తి,, నాయకులు ఎర్రబెల్లి శంకర్, గుమ్మడెల్లి దుర్గయ్య, నాయకులు నిమ్మగడ్డ వెంకటేశ్వర్ రావు, యూసుఫ్, సత్యనారాయణాచారి, షాహీన్, కైసర్, మేదిని లక్ష్మి, షమీమ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ డ్రైవర్ శంకర్ గౌడ్ అంత్యక్రియల్లో ఉద్రికత్త

**వరంగల్ :** ఆర్టీసీ డ్రైవర్ శంకర్ గౌడ్ అంత్యక్రియల్లో ఉద్రికత్త నెలకొంది. శంకర్ గౌడ్ శవాన్ని నర్సంపేట డిపోకు తరలించాలని కుటుంబ సభ్యులు కోరారు. డిపోకు తీసుకొస్తే శంకర్ గౌడ్ కు నివాళి అర్పించే అవకాశాన్ని కల్పించాలని కార్మికులు కోరారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలున్నందున పోలీసులు ససేమిరా ఒప్పుకోలేదు. శాంతి భద్రతల సమస్య తలెత్తుతుందని వెల్లడించారు. పోలీసుల తీరుపై కేంద్ర మంత్రి మండి సంజయ్ కుమార్ ఆగ్రహం వ్యక్తం చేసారు. మానవత్వం లేకుండా వ్యవహరిస్తే ఎలా అని మండిపడ్డారు. కుటుంబ సభ్యుల విజ&ఝప్తిని మన్నించాలని సూచించారు. పోలీసుల వినకపోవడంతో కుటుంబ సభ్యులు, బీజేపీ శ్రేణులు, కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేసారు. సీఎంకు, పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేసారు. శంకర్ గౌడ్ శవాన్ని నర్సంపేటకు తరలించేందుకు బలవంతంగా బయటకు తీసుకొచ్చారు. ఈ నేపధ్యంలో పోలీసులకు, కార్యకర్తలు, కార్మికుల మధ్య పెనుగులాట జరిగింది. నడిరోడ్డుపైనే శంకర్ గౌడ్ శవాన్ని ఉంచారు న పోలీసులు. కోపోద్రిక్తులైన కార్యకర్తలు శవపేటికను తీసేసి శవాన్ని ఎత్తుకుని అంబులెన్స్ లోకి ఎక్కించే యత్నం చేసారు. తరువాత పోలీసులు శంకర్ గౌడ్ శవాన్ని మళ్లీ తమ ఆధీనంలోకి తీసుకున్నారు. శవాన్ని తీసుకెళ్లి ఏం చేసుకుంటారో చేసుకోండంటూ కుటుంబ సభ్యులు అన్నారు. కేంద్ర మంత్రితో పోలీస్ కమిషనర్ మంతనాలు జరిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు శంకర్ గౌడ్ కుటుంబ సభ్యుల జేఏసీ నాయకులతో చర్చలు జరిపారు. శంకర్ గౌడ్ కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటామని హామీ, ఆర్టీసీ కార్మికుల డిమాండ్లను పరిష్కరిస్తామని భరోసా ఇవ్వండంతో అందరూ శాంతించారు.

## స్వీయ గణన ద్వారా జనగణన వేగవంతం

## జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**మంచిర్యాల :** జనగణన 2027లో భాగంగా స్వీయ గణన ప్రక్రియ నిర్వహణపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఒక ప్రకటనలో తెలిపారు. జన గణనను రెండు విడతలుగా నిర్వహించడం జరుగుతుందని మొదటి విడతలో మే 11వ తేదీ నుండి జూన్ 9వ తేదీ వరకు ఇండ్ల గణన రెండవ విడతలో జనగణన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు డిజిటల్ సాంకేతికతను ఉపయోగించి నాణ్యమైన స్పష్టమైన జాబితా రూపొందించడం జరుగుతుందని ఇందు కొరకు ఎన్యుమరేటర్లు సూపర్వైజర్లకు తగు శిక్షణ అందించడం జరుగుతుందని తెలిపారు. స్వీయ గణన కార్యక్రమం నిర్వహణలో ప్రజా ప్రతినిధులు ప్రభుత్వ ఉద్యోగులు ప్రముఖ వ్యక్తులు గణన అధికారులు యువత స్వయం సహాయక సంఘాల ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించడం జరుగుతుందని ఈ నెల 26వ తేదీ నుండి మే 10వ తేదీ వరకు స్వీయ గణన పోర్టల్ అందుబాటులో ఉంటుందని జిల్లాస్థాయి జనగణన అధికారులు ప్రతిరోజు స్వీయ గణన వివరాలను నవీకరించాలని తెలిపారు. జిల్లాలోని అన్ని మండలాలు గ్రామపంచాయతీలు మున్సిపల్ కార్పొరేషన్ మున్సిపాలిటీలలో స్వీయ గణనపై ప్రజలందరికీ తెలిసే విధంగా విస్తృత ప్రచారం నిర్వహించాలని తెలిపారు. జిల్లా అధికారులు మున్సిపల్ కమిషనర్లు స్వీయ గణన కార్యక్రమ కార్యచరణను పకడ్బందీగా అమలు చేయాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాలు అభివృద్ధి కార్యక్రమాల అమలు జనాభా ప్రాతిపదికన చేపట్టడం జరుగుతుందని ఈ క్రమంలో స్పష్టమైన జాబితా రూపొందించేందుకు జిల్లా ప్రజలు సహకరించాలని తెలిపారు. ఈ నెల 26వ తేదీ నుండి మే 10వ తేదీ వరకు ఆన్ లైన్ లో ష్ట్రబిబిజూబ://బఇ.ఇవనిబబిబ.ణనీల.తిని వెబ్ సైట్ ద్వారా స్వీయ గణన చేసుకోవచ్చని జనగణలో భాగంగా అధికారులు ఇంటికి వచ్చినప్పుడు స్వీయ గణన ఐ.డి. అందించవచ్చని తెలిపారు. జన గణన కొరకు అధికారులు వచ్చిన సమయంలో ప్రజలు వాస్తవ సమాచారాన్ని అందించాలని దినపత్రికలు లోకల్ కేబుల్ చానళ్లు వాట్సాప్ గ్రూపులు సోషల్ మీడియా కార్యాలయాలను ప్రదర్శన ద్వారా ప్రజలందరికీ తెలిసేలా విస్తృత ప్రచారం నిర్వహించాలని తెలిపారు.

## రెడీ టు ఈట్ మటన్

**హైదరాబాద్ :** హైదరాబాద్ కు ప్రత్యేకమైన నిజామీ మాంసాహార వంటకాల రుచులను ఆధునిక జీవనశైలికి అనుగుణంగా కేవలం 5 నిమిషాల్లోనే వండుకుని తినోచ్చని అంటున్నారు గోల్డెన్ స్ప్రింగ్స్ ఆగ్రో సంస్థ నిర్వాహకులు. ఇతర ఆధునిక ఆహార పదార్థాలల మాంసాన్ని కూడా రెడీ–టు–ఈట్ ఉత్పత్తులుగా అందుబాటులోకి తీసుకొచ్చింది ఈ సంస్థ. నేషనల్ మీట్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ (ఎన్.ఎం.ఆర్.ఐ) సహకారంతో అభివృద్ధి చేసిన ఈ 'ఓల్డెన్ బైట్'ఉత్పత్తులను బంజారాహిల్స్లోని రత్నదీప్ సూపర్ మార్కెట్లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఐసీఏఆర్–ఎన్ఎంఆర్ఐ డైరెక్టర్ డా. బరబుద్దే మాట్లాడుతూ.. ఓల్డెన్ బైట్స్ సంస్థ పరిశుభ్రతతో, నాణ్యతతో ఉత్పత్తులు తయారు చేయడం అభినందనీయమన్నారు. దేశవ్యాప్తంగా రిటైల్ స్టోర్లు, ఈ–కామర్స్ వేదికల ద్వారా 'ఓల్డెన్ బైట్' ఉత్పత్తులను విస్తరిం చనున్నట్లు పేర్కొన్నారు.

## శంకర్ గౌడ్ అంత్యక్రియలపై మంతనాలు

**నర్సంపేట :** శంకర్ గౌడ్ డెడ్ బాడీ అంత్యక్రియలపై ట్విస్ట్ శుక్రవారం కొనసాగింది. శంకర్ గౌడ్ అంత్యక్రియాల విషయంలో కుటుంబ సభ్యులు, ఆర్టీసీ జేఏసీ నేతల నిర్ణయమే ఫైనల్ అని కేంద్ర మంత్రి బండి సంజయ్ చెప్పారు. సొంత ఇల్లు కూడా లేని శంకర్ గౌడ్ ఆర్టీసీకి 22 ఏళ్లపాటు సేవలందించారు. కుటుంబ సభ్యుల విజ&ఝప్తిని పరిగణలోకి తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. 5 నిమిషాలపాటు నర్సంపేట ఆర్టీసీ డిపోలో శంకర్ గౌడ్ భౌతిక దేహానికి నివాళి అర్పించేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు. బండి సంజయ్ వ్యాఖ్యల నేపథ్యలో ఆర్టీసీ జేఏసీ నేతలతో పోలీసులు మంతనాలు జరిపారు. నర్సంపేట ఆర్టీసీ డిపోకు తరలిస్తే శాంతి భద్రతలకు విఘాతం కలుగుతుందని జేఏసీ నేతలను నచ్చజెప్పేందుకు పోలీసులు ప్రయత్నించారు. ముత్తోజీపేటలోనే అంత్యక్రియలు జరిగేలా సహకరించాలని కోరారు. మండుటెండలో ముత్తోజీపేట రోడ్డు పక్కనే 3 గంటలుగా కేంద్ర మంత్రి బండి సంజయ్ వుండిపోయారు.

## నాదెండ్ల భాస్కర రావుకు కేటీఆర్ నివాళులు

**హైదరాబాద్ :** ఇటీవల మృతి చెందిన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నాదెండ్ల భాస్కర్ రావు చిత్రపటానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే. తారక రామారావు (కేటీఆర్), ఎమ్మెల్యే వివేకానంద గౌడ్, ఎమ్మెల్సీ శంబిపూర్ రాజు, మాజీ ఎంపీ రావుల చంద్రశేఖర్ రెడ్డి పూలమాలలు అర్పించి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన కుమారుడు, ఆంధ్రప్రదేశ్ పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ , ఇతర కుటుంబ సభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

## ఆర్టీసీ కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలి

**మరణించిన ఆర్టీసీ కార్మికుడు శంకర్ గౌడ్ కుటుంబాన్ని ఆదుకోవాలి**
**మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ కాపు సీతాలక్ష్మి**




**కొత్తగూడెం :** తెలంగాణ ఆర్టీసీ కార్మికుల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని కొత్తగూడెం మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ కాపు సీతాలక్ష్మి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం కొత్తగూడెం ఆర్టీసీ డిపో ఎదుట ఆర్టీసీ కార్మికులు చేపట్టిన సమ్మెకు మాజీ మంత్రి వనమా వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీ సంపూర్ణ మద్దతు తెలిపింది. ఈ నిరసనలో సీతాలక్ష్మి మాట్లాడుతు ఆర్టీసీ కార్మికులు తమ సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వానికి సమ్మె నోటీసులు ఇస్తే స్పందించలేదని వ్యాఖ్యానించారు. తద్వారా వారు సమ్మె ప్రారంభించగా నర్సంపేట ఆర్టీసీ డిపో డ్రైవర్ శంకర్ గౌడ్ పెట్రోల్ పోసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని ఆందోళన వ్యక్తం చేశారు. సమ్మె నోటీసులతో ప్రభుత్వం స్పందించి ఉంటే ఓ నిండు ప్రాణం పోయేది కాదని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే ఆర్టీసీ కార్మికులతో చర్చలు జరిపి వారి సమస్యలకు పరిష్కారం చూపాలని ప్రభుత్వాన్ని కోరారు. అలాగే హక్కుల సాధన కోసం అమరుడైన శంకర్ గౌడ్ కుటుంబాన్ని అన్ని విధాల ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు.

## బిజినెస్

### ఇన్ఫీలో 20 వేల ఉద్యోగాలు

**2026-27లో ఫ్రెషర్లను నియమించుకోనున్న సంస్థ**

**నాలుగో త్రైమాసికంలో రూ.8,501 కోట్ల లాభం**




**న్యూఢిల్లీ :** దేశీయ ఐటీ దిగ్గజం ఇన్ఫోసిస్ అంచనాలకుమించి రాణించింది. గడిచిన ఆర్థిక సంవత్సరం చివరి త్రైమాసికంలో సంస్థ రూ.8,501 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. అంతక్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో ఆర్జించిన రూ.7,033 కోట్ల లాభంతో పోలిస్తే 20.8 శాతం వృద్ధిని కనబరిచినట్టు సంస్థ వెల్లడించింది. సమీక్షకాలంలో కంపెనీ ఆదాయం ఏడాది ప్రాతిపదికన 13.4 శాతం ఎగబాకి రూ.46,402 కోట్లకు చేరుకున్నట్టు బీఎస్ఈకి సమాచారం అందించింది.కిందటేడాది ఇదే త్రైమాసికంలో సంస్థ రూ.40,925 కోట్ల ఆదాయాన్ని ఆర్జించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 20 వేల మంది ఉద్యోగులను రిక్రూట్ చేసుకోబోతున్నట్టు ప్రకటించింది. ఈ నియామకాలను క్యాంపస్, ఇతర యూనివర్సిటీల నుంచి చేపట్టనున్నట్టు కంపెనీ చీఫ్ ఫైనాన్షియల్ అధికారి జయేశ్ సంఘరాజ్కా తెలిపారు. మరోవైపు, గతేడాది నాలుగో త్రైమాసికంలో 8,400 మంది సిబ్బంది సంస్థ నుంచి వైదొలుగుడంతో మొత్తం సంఖ్య 3,28,594కి పడిపోయారు. గత త్రైమాసికంలో ఉద్యోగుల వలసలు 12.6 శాతానికి పెరిగాయి. అంతక్రితం ఏడాది ఇది 12.3 శాతంగా ఉన్నది.ఈ ఏడాది వృద్ధి 3.5 శాతం లోపేప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో కంపెనీ ఆదాయంలో వృద్ధి 1.5 శాతం నుంచి 3.5 శాతం లోపు ఉంటుందని గైడెన్స్‌లో వెల్లడించింది. ప్రపంచవ్యాప్తంగా ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నప్పటికీ ఆర్థిక సేవలు, యుటిలిటీ, ఏఐ ఆధారిత సేవలకు డిమాండ్ ఉంటుందని కంపెనీ భావిస్తున్నది.గడిచిన ఆర్థిక సంవత్సరంలో అన్ని రంగాల్లో రాణించాం. 14.9 బిలియన్ డాలర్ల విలువైన ఒప్పందాలు కుదుర్చుకోవడం వల్లనే 3.1 శాతం వృద్ధి సాధ్యమైంది. నూతన టెక్నాలజీ ఏఐ పటిష్ఠతను, అలాగే భారీ పరివర్తనాత్మక అవకాశాలు మార్కెట్ వృద్ధికి దోహదం చేశాయి. ఆరు విభాగాలకు ఏఐ సర్వీసులను విస్తరించడం కలిసొచ్చింది.

### రికార్డు స్థాయిలో మారుతి కార్ల ఉత్పత్తి




**న్యూఢిల్లీ, ఏప్రిల్ 23:** కార్ల తయారీలో అగ్రగామి సంస్థయైన మారుతి సుజుకీ మరో రికార్డును సృష్టించింది. గడిచిన ఆర్థిక సంవత్సరంలో సంస్థ 23.4 లక్షల యూనిట్ల వాహనాలను ఉత్పత్తి చేసింది. ఒకే ఏడాది ఇంతటి స్థాయిలో వాహనాలను ఉత్పత్తి చేయడం ఇదే తొలిసారని కంపెనీ పేర్కొంది. కేవలం ప్యాసింజర్ వాహనాలను భారత్‌కు తయారు చేసి ఈ రికార్డు నెలకొల్పినట్టు దేశీయ ఆటోమొబైల్ తయారీదారుల సంఘం(సియామ్) తాజాగా వెల్లడించింది. ఈ సందర్భంగా కంపెనీ ఎండీ, సీఈవోహిసాచి తకేచి మాట్లాడుతూ..ప్రపంచవ్యాప్తంగా చాలా దేశాల్లో కార్లను ఉత్పత్తి చేస్తున్నప్పటికీ ఒకే దేశంలో ఒకే ఏడాది ఇంతటి స్థాయిలో ఉత్పత్తి జరుపడం ఇదే తొలిసారని పేర్కొన్నారు. జీఎస్టీ 2.0ని ప్రకటించడంతోపాటు మార్కెట్లు మరింత బలోపేతం కావడం, చిన్న స్థాయి కార్లకు పెరుగుతున్న డిమాండ్‌తో కార్ల అమ్మకాలు టాప్‌గేర్‌లో దూసుకుపోతున్నాయని చెప్పారు. దేశవ్యాప్తంగా కార్లకు పెరుగుతున్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని ఏటా ఉత్పత్తి సామర్థ్యాన్ని 40 లక్షలకు పెంచుకునేయోచనలో ఉన్నట్టు ఆయన తెలిపారు. గతేడాది డిజైర్, ఫ్రాంక్స్, స్విఫ్ట్, ఎర్టిగా, బాలెనో మాడళ్లు అత్యధికంగా అమ్ముడయ్యాయి. ప్రస్తుతం సంస్థకు దేశవ్యాప్తంగా నాలుగు ఉత్పత్తి కేంద్రాలు ఉండగా, ఐదో ప్లాంట్ త్వరలో అందుబాటులోకి రాబోతున్నది.

# జోరుగా డాలర్ బిలియనీర్లు



**న్యూఢిల్లీ,:** వచ్చే ఐదేండ్లలో దేశంలో సంపన్నుల సంఖ్య భారీగా పెరగనుందని ప్రముఖ రియల్ ఎస్టేట్ కన్సల్టెంట్ నైట్ ఫ్రాంక్ ఓ తాజా నివేదికలో అంచనా వేసింది. 2031నాటికి భారత్‌లో అల్ట్రా హై నెట్ వర్త్ ఇండివిడ్యువల్స్ (నికరంగా రూ.282 కోట్లు, ఆపై సంపద కలిగినవారు-డాలర్‌తో పోల్చితే ప్రస్తుత రూపాయి మారకం విలువ ప్రకారం 30 మిలియన్ డాలర్లు, అంతకుమించి సొమ్మున్నవారు) సంఖ్య 26 శాతం ఎగబాకి 25,217 మందికి చేరవచ్చని గురువారం విడుదల చేసిన తమ 20వ వెల్త్ రిపోర్ట్ 2026 ఎడిషన్‌లో పేర్కొన్నది.అలాగే డాలర్ బిలియనీర్లు (రూ.9,400 కోట్లు సంపద కలిగినవారు-100 కోట్ల డాలర్ల సొమ్మున్నవారు) 51 శాతం ఎగిసి 313 మందికి పెరుగవచ్చున్నది. టెక్నాలజీ, ఇండస్ట్రియల్స్, డెట్-ఈక్విటీ, ఫారెక్స్, డెరివేటివ్స్, ఈటీఎఫ్, ప్రైమరీ, సెకండరీ మార్కెట్స్ వ్యాప్తంగా పెరుగుతున్న సంపద సృష్టే తమ అంచనాలకు కారణమని వివరించింది. కాగా, ప్రస్తుతం (ఈ ఏడాది ఆరంభంలో) భారత్‌లో అల్ట్రా హై నెట్ వర్త్ ఇండివిడ్యువల్స్ (యూహెచ్ఎన్‌డబ్ల్యూఐ) 19,877 మంది ఉన్నారని, డాలర్ బిలియనీర్ల సంఖ్య 207గా ఉన్నదని నైట్ ఫ్రాంక్ ఈ సందర్భంగా తెలియజేసింది.అనిశ్చిత పరిస్థితుల్లోనూ.. భౌగోళిక-రాజకీయ అనిశ్చిత పరిస్థితులు తీవ్రంగా ఉన్నప్పటికీ, వడ్డీరేట్ల పెరుగుదలపై ఆందోళనలు వ్యక్తమవుతున్నా, ఆర్థిక ఒడిదుడుకులు చోటుచేసుకుంటున్నా.. ప్రపంచంలో సంపద సృష్టి నాటకీయంగా పెరుగుతూనే ఉన్నదని ఈ రిపోర్టులో నైట్ ఫ్రాంక్ అభిప్రాయపడటం గమనార్హం. కాగా, 2021లో 5,51,435గా ఉన్న ప్రపంచ యూహెచ్ఎన్ డబ్ల్యూఐ జనాభా.. ఇప్పుడు 7,13,626కు చేరింది. ఇక అమెరికాలో ఇప్పుడు 914 మంది డాలర్ బిలియనీర్లున్నారని, చైనాలో 485 మంది ఉన్నట్టు నైట్ ఫ్రాంక్ వెల్లడించింది. ఆ తర్వాత స్థానం భారత్‌దే (207)నని స్పష్టం చేసింది.

# ఇరాన్ చాబహార్ పోర్ట్‌లో.. వాటాలు విక్రయించనున్న భారత్?

ఇరాన్‌లోని చాబహార్ పోర్టు ప్రాజెక్టుపై నీలినీడలు కమ్ముకొన్నాయి దాదాపు పదేళ్లు కావొస్తున్నా మౌలిక సదుపాయాల కల్పన పనులు ఓ కొలిక్కి రాలేదు. టెహ్రాన్‌పై అమెరికా ఆంక్షలతో భారత్ ఆ ప్రాజెక్టునే దిలించుకోవాలనుకుంటుదనే వార్తలు వస్తున్నాయి. చాబహార్ పోర్టు ప్రాజెక్ట్‌ను ఇరాన్ సంస్థకు విక్రయించేందుకు సిద్ధమవుతోందని ఆంగ్ల మీడియా కథనాలను బట్టి తెలుస్తోంది. ఈ పోర్ట్‌కు సంబంధించి అగ్రరాజ్యం ఇచ్చిన మినహాయింపులు ఈ ఏడాది 2026 ఏప్రిల్ 26తో ముగియనున్న నేపథ్యంలో ఈ కథనాలు వచ్చాయి. ఇండియా పోర్ట్స్ గ్లోబల్ చాబహార్ ఫ్రీజోన్ లో ఇండియా పోర్ట్స్ గ్లోబల్ లిమిటెడ్ కు ఉన్న వాటాను తిరిగి ఇరాన్ సంస్థకే విక్రయించేలా ప్రతిపాదనలు రూపొందించినట్లు తెలుస్తోంది. ఇరాన్ దక్షిణ తీరంలోని చాబహార్ నౌకాశ్రయం అభివృద్ధి ప్రాజెక్టులో భారత్ ప్రధాన భాగస్వామి. మధ్య ఆసియా దేశాలతో భారత్ వాణిజ్యం జరిపేందుకు ఈ పోర్టు ప్రధాన మార్గంగా ఉంది. పాకిస్థాన్‌తో సంబంధం లేకుండా అఫ్గానిస్థాన్‌కు భారత్ అందించే ఆహార ధాన్యాలను ఈ మార్గంలోనే పంపిస్తున్నారు. ఈ పోర్టు అభివృద్ధి, నిర్వహణలో మన దేశానిదే కీలక పాత్ర. ఇప్పటికే భారీగా పెట్టుబడులు పెట్టింది. దీనికి సంబంధించి భారత్- ఇరాన్‌ల మధ్య 2016లోనే ఒప్పందం కుదిరింది.సమయం మించిపోతోంది: ఇరాన్‌కు ట్రంప్ హెచ్చరికలుప్రస్తుతం ట్రంప్ ఆంక్షల కత్తి వేలాడుతున్న నేపథ్యంలో చాబహార్ పోర్టు ప్రాజెక్టులో తన భాగస్వామ్యంపై భారత్ వివిధ అవకాశాలను పరిశీలిస్తున్నట్లు గతంలో వార్తలు వచ్చాయి. ఈ ప్రాజెక్టులో తన ప్రత్యక్ష ప్రమేయాన్ని ముగించే దిశగా.. గతంలో కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం దాదాపు 120 మిలియన్ డాలర్లను బదిలీ చేసే ప్రక్రియలో ఉందని ఆ వార్తల సారాంశం. ఈ ప్రాజెక్టు నుంచి భారత్ వైదొలగాలని చూస్తోందనే కథనాలపై గతంలోనే విదేశాంగశాఖ కూడా స్పందించింది. దీనిపై అమెరికాతో సంప్రదింపులు జరుగుతున్నాయని వెల్లడించింది. మరిప్పుడు అమెరికా మినహాయింపులు రెండు రోజుల్లో ముగియనున్నాయి. ప్రస్తుతం ఇరాన్‌తో యుద్ధంలో నిమగ్నమైన అమెరికా ఆ మినహాయింపులను పొడిగిస్తుందా..? అన్నది అనుమానమే.



# నా ఆఖరి మిషన్ అదే.. త్వరలోనే క్రికెట్‌ను వదిలేస్తా..!

న్యూజిలాండ్ మహిళా క్రికెటర్ సుజీ బేట్స్ కీలక నిర్ణయం తీసుకుంది. రెండు దశాబ్దాలకు పైగా వైట్ ఫెర్న్స్ జట్టు విజయాల్లో కీలకమవుతున్న ఈ సీనియర్ ఆల్‌రౌండర్ త్వరలోనే అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలకనుంది. ఈ ఏడాది టీ20 ప్రపంచకప్ విజేతగా క్రికెట్‌కు అల్విదా చెబుతానని వెల్లడించిందీ సీనియర్ ప్లేయర్. బ్రిటన్‌లో జరుగబోయే పొట్టి ప్రపంచకప్ నాకు ఆఖరు. ఈ టోర్నీలో ఛాంపియన్‌గా ఆటకు రిటైర్మెంట్ చెప్పేస్తాను అని బేట్స్ తెలిపింది. మహిళా క్రికెట్‌లో సీనియర్ ప్లేయర్ సుజీ బేట్స్ అంతర్జాతీయ క్రికెట్‌ను వీడేందుకు సిద్ధమైంది. వచ్చే పొట్టి ప్రపంచకప్ ఆడేసి ఆటకు గుడ్ బై చెప్పాలని బేట్స్ నిర్ణయించుకుంది. 'ఇరవై ఏళ్ల కెరీర్‌ను చూసుకుంటే.. కాలం ఎంత త్వరగా పరుగులు తీసిందో నమ్మలేకపోతున్నా. వైట్ ఫెర్న్స్ తరఫున ఎన్నో విజయాలు సాధించడం చాలా గర్వంగా ఉంది. ప్రతిరోజు గొప్ప వ్యక్తిగా, జట్టు సభ్యురాలిగా, అథ్లెట్‌గా ఉండేందుకు ప్రయత్నిస్తాను అని బేట్స్ వెల్లడించింది. నా




ఆఖరి మిషన్ ఒకటుంది. నాకు ఎన్నో మధుర జ్ఞాపకాలు మిగిల్చిన బ్రిటన్‌కు వెళ్లి.. అక్కడ మరొక వరల్డ్‌కప్ గెలవాలని అనుకుంటున్నా. చివరిసారిగా జట్టు కోసం నా సర్వశక్తులు ఒడ్డుతాను. నాకు మద్దతుగా నిలిచిన కుటుంబసభ్యులు, స్నేహితులు అందరికీ కృతజ్ఞతలు. ఈ ప్రయాణంలో ఎదరైన ఒడిదొడుకుల్లో తోడుగా ఉన్న నా భర్త స్కాటీ, నా కుమారులకు కృతజ్ఞతలు. నాకు ఇన్ని అవకాశాలు కల్పించిన కోచ్‌లకు ధన్యవాదాలు' అని బేట్స్ పేర్కొంది.

**2006లో అంతర్జాతీయ మ్యాచ్**

దేశవాళీ క్రికెట్‌లో పదిహేనేళ్లకు అరంగేట్రం చేసిన బేట్స్ 2006లో అంతర్జాతీయ మ్యాచ్ ఆడింది. మహిళల టీ20ల్లో అత్యధిక పరుగుల రికార్డు నెలకొల్పిన ఈ సీనియర్ ఆల్‌రౌండర్ వన్డేల్లో నాలుగో స్థానంలో కొనసాగుతోంది. 2011లో కివీస్ సారథిగా ఎంపికైన బేట్స్ ఏడేళ్లు జట్టును గొప్పగా నడిపింది. క్రికెటర్‌గా, కెప్టెన్‌గా రాణించిన ఆమెను విజ్డెన్ 2016లో ప్రపంచంలో అగ్రగామి మహిళా క్రికెట్‌గా గుర్తించింది. ఇటీవలే తొడ కండరాల గాయం నుంచి కోలుకున్న బేట్స్ వరల్డ్‌కప్ స్క్వాడ్‌కు ఎంపికైంది. మే నెల మొదటి వారంలో న్యూజిలాండ్ జట్టు ఇంగ్లండ్‌తో వన్డే, టీ20 సిరీస్‌లో ఆడనుంది. క్రికెట్‌తో పాటు బాస్కెట్ బాల్ ఆటలోనూ బేట్స్‌కు ప్రావీణ్యం ఉంది. 2008లో ఆమె బీజింగ్ ఒలింపిక్స్‌లో సైతం పాల్గొంది. జూన్ 12 నుంచి ఇంగ్లండ్ వేదికగా మహిళల పొట్టి ప్రపంచకప్ షురూ కానుంది. మరుసటి రోజే వెస్టిండీస్‌తో న్యూజిలాండ్ తలపడనుంది.

# అతడు ఫెయిలైతే చెన్నైది మళ్లీ పాత కథే: సెహ్వాగ్

ఐపీఎల్-2026లో ఇప్పటికి ఏడు మ్యాచ్‌లు పూర్తి చేసుకున్న చెన్నై సూపర్ కింగ్స్ మూడింట గెలిచింది. ముంబై ఇండియన్స్‌తో గురువారం నాటి మ్యాచ్‌లో ఏకపక్ష విజయం సాధించి పాయింట్ల సంఖ్యను ఆరుకు పెంచుకుంది. సొంతమైదానం వాంఖడేలో ముంబైని చెన్నై చిత్తు చేయడంతో అభిమానులు ఫుల్ ఖుషీ అవుతున్నారు. అయితే, టీమిండియా మాజీ ఓపెనర్, కామెంటేటర్ వీరేందర్ సెహ్వాగ్ మాత్రం చెన్నై విషయంలో భిన్నంగా స్పందించాడు. ఒక్కరిపై ఆధారపడితే చెన్నై ఈసారి కూడా గట్టెక్కలేదని అభిప్రాయపడ్డాడు. కాగా చెన్నై ఇప్పటికి మూడు విజయాలు సాధించగా.. ఈ మూడింటిలో సంజూ శాంసన్ రెండు అజేయ సెంచరీలతో జట్టును గెలిపించాడు. ఢిల్లీ క్యాపిటల్స్‌తో మ్యాచ్‌లో 115 పరుగులు చేసిన సంజూ.. తాజాగా ముంబైపై 101 పరుగులు సాధించాడు. ఈ రెండు మ్యాచ్‌లలో మిగతా బ్యాటర్ల నుంచి అతడికి పెద్దగా సహకారం అందలేదు. ఇక కోల్‌కతా నైట్ రైడర్స్‌తో మ్యాచ్‌లోనూ సంజూ 48 పరుగులతో టాప్‌రన్‌స్కోరర్‌గా నిలిచి జట్టుకు విజయం అందించాడు. ఈ నేపథ్యంలో వీరేందర్ సెహ్వాగ్ మాట్లాడుతూ.. "ప్రస్తుతం చెన్నై జట్టును అందరూ ప్రశంసిస్తున్నారు. కానీ ఆ జట్టు గెలిచిన ప్రతి సందర్భంలోనే ఒకే ఒక్క బ్యాటర్ పరుగులు రాబట్టాడు. అతడు పరుగులు చేయడంలో విఫలమైన రోజు కథ వేరుగా ఉంటోంది. ఒకవేళ అతడు మళ్లీ గనుక ఫెయిలైతే పాత కథే పునరావృతం అవుతుంది. కాబట్టి ఒకే ఒక్క బ్యాటర్‌పై ఆధారపడటం సరికాదు. సంజూతో పాటు పరుగులు రాబట్టే ఆయుశ్ మాత్రే దురదృష్టవశాత్తూ గాయం వల్ల జట్టుకు దూరమయ్యాడు. కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్, శివం దూబే, డెవాల్డ్ బ్రెవిస్ మీద చెన్నై ఆశలు పెట్టుకుంది. సంజూతో కలిసి వాళ్లు కూడా రాణిస్తేనే సీఎస్‌కే ప్రయాణం ముందుకు సాగుతుంది" అని క్రిక్‌బజ్ షోలో పేర్కొన్నాడు. ఏదేమైనా సంజూ శాంసన్ సంచలన ఇన్నింగ్స్‌తో ముంబైపై చెన్నైకి విజయం అందించాడని సెహ్వాగ్ ప్రశంసించాడు.కాగా రికార్డు స్థాయిలో ఐదుసార్లు చాంపియన్‌గా నిలిచిన చెన్నై.. కొన్నేళ్లుగా పేలవ ప్రదర్శన కనబరుస్తోంది. గతేడాది పద్నాలుగింట కేవలం నాలుగు గెలిచి పట్టికలో అట్టడుగున పదో స్థానంలో నిలిచింది.




## స్పోర్ట్స్

### అందుకే శ్రేయస్ అయ్యర్‌ను వదులుకున్నాం

### కేకేఆర్ మాజీ కోచ్



భారత దేశీ క్రికెట్‌లో కోచ్‌గా చంద్రకాంత్ పండిట్‌కు మంచి పేరుంది. అతడి మార్గదర్శనంలోనే మధ్యప్రదేశ్ తొలి రంజీ టైటిల్ అందుకుంది. రంజీ 2021-22 సీజన్‌లో చాంపియన్‌గా నిలిచింది. ఈ క్రమంలోనే ఐపీఎల్ ఫ్రాంచైజీ కోల్‌కతా నైట్ రైడర్స్ హెడ్‌కోచ్‌గా చంద్రకాంత్ పండిట్ బాధ్యతలు చేపట్టాడు. చంద్రకాంత్ మార్గ నిర్దేశనం, శ్రేయస్ అయ్యర్ కెప్టెన్సీలో కేకేఆర్ 2024లో చాంపియన్‌గా అవతరించింది. అయితే, వీరి కంటే నాటి మెంటార్ గౌతం గంభీర్‌కే క్రెడిట్ ఎక్కువగా వచ్చింది. ఇక 2024 తర్వాత కేకేఆర్ శ్రేయస్‌ను వదిలేసుకుంది. ఈ క్రమంలో 2025 మెగా వేలంలో పంజాబ్ కింగ్స్ అతడిని ఏకంగా రూ. 26.75 కోట్ల రికార్డు ధరకు కొనుగోలు చేసింది.

అందుకు తగినట్లుగానే శ్రేయస్ అయ్యర్ బ్యాటర్‌గా, కెప్టెన్‌గా రాణించి పంజాబ్‌ను గతేడాది ఫైనల్‌కు చేర్చాడు. ఈ ఏడాది కూడా అతడి సారథ్యంలో పంజాబ్ ప్లే ఆఫ్స్ దిశగా దూసుకుపోతోంది. మరోవైపు.. శ్రేయస్‌ను వదులుకున్న కేకేఆర్ వరుస పరాజయాలతో డీలా పడి.. విమర్శలు మూటగట్టుకుంటోంది. ఈ నేపథ్యంలో కేకేఆర్ మాజీ హెడ్‌కోచ్ చంద్రకాంత్ పండిట్ శ్రేయస్ అయ్యర్‌ను వదులుకోవడంపై తాజాగా స్పందించాడు. "దురదృష్టవశాత్తూ ఆరోజు మేము అతడి సేవలు కోల్పోయాము. శ్రేయస్ అద్భుతమైన ఆటగాడు. కెప్టెన్‌గా కేకేఆర్‌కు ట్రోఫీ అందించాడు. అతడు జట్టును నడిపించే విధానానికి నేను అభిమానిని. అయితే, కొన్నిసార్లు దీర్ఘకాల ప్రయోజనాలు, వ్యూహాల దృష్ట్యా కొంతమంది ప్లేయర్లను వదులుకోవాల్సి వస్తుంది. నిజానికి ఆరోజు కేకేఆర్ కోచ్‌గా నేను ఈ విషయంలో చాలా బాధపడ్డాను.

**అందుకే అతడిని వదులుకున్నాము**

అయితే, కావాలని మేము అతడిని వదులుకోలేదు. అప్పటి పరిస్థితులు అలా ఉన్నాయి. శ్రేయస్ ఒక్కడినే కాదు.. ఫిల్ సాల్ట్ వంటి ఆటగాళ్లను కూడా మేము వదిలేశాము. ఏదేమైనా కోచ్‌గా ఉన్న సమయంలో కేకేఆర్ యజమానులు షారుఖ్ ఖాన్, జూహీ చావ్లా, జై మెహతా, సీఈఓ వెంకీ మైసూర్ నాకు అండగా ఉన్నారు" అని చంద్రకాంత్ పండిట్ రెవ్‌స్పోర్ట్జ్‌తో పేర్కొన్నాడు. కాగా 2025 సీజన్ తర్వాత చంద్రకాంత్ పండిట్‌కు ఉద్వాసన పలికిన కేకేఆర్.. 2026కు గానూ అభిషేక్ నాయర్‌ను హెడ్‌కోచ్‌గా ప్రకటించింది. గతేడాది అజింక్య రహానే కెప్టెన్సీలో పద్నాలుగింట కేవలం ఐదు గెలిచిన కేకేఆర్ పాయింట్ల పట్టికలో ఎనిమిదో స్థానంలో నిలిచింది. ఈ ఏడాది ఇప్పటికి ఏడింట ఒక్కటి మాత్రమే గెలిచి అట్టడుగున పదో స్థానంలో కొట్టుమిట్టాడుతోంది.



# సమీరా రెడ్డి గ్రాండ్ రీ-ఎంట్రీకి సిద్ధం

### స్టార్ హీరో ప్రాజెక్ట్‌తో సెకండ్ ఇన్నింగ్స్

ఒకప్పుడు టాలీవుడ్‌లో గ్లామర్, నటనతో ప్రేక్షకులను ఆకట్టుకున్న నటి సమీరా రెడ్డి మళ్లీ వెండితెరపై మెరిపించేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం. సుదీర్ఘ విరామం తర్వాత ఆమె రీ-ఎంట్రీపై వస్తున్న వార్తలు సినీ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. మెగాస్టార్ చిరంజీవి, యంగ్ టైగర్ ఎన్టీఆర్ వంటి అగ్ర హీరోల సరసన నటించి మంచి గుర్తింపు పొందిన సమీరా, పెళ్లి తర్వాత సినిమాలకు దూరమైంది. అయితే ఇప్పుడు మళ్లీ సెకండ్ ఇన్నింగ్స్ ప్రారంభించేందుకు ఓ క్రేజీ ప్రాజెక్ట్‌ను ఎంపిక చేసుకున్నట్లు తెలుస్తోంది. తాజా సమాచారం ప్రకారం, ఓ స్టార్ హీరో సినిమాలో సమీరా రెడ్డి కీలకమైన పాత్రలో నటించేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలిసింది. ప్రస్తుతం ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన చర్చలు పూర్తయ్యాయని, త్వరలోనే అధికారిక ప్రకటన వెలువడే అవకాశముందని సినీ వర్గాలు చెబుతున్నాయి.గతంలో కమర్షియల్ సినిమాల్లో హీరోయిన్‌గా అలరించిన సమీరా, ఇప్పుడు తన వయస్సు, అనుభవానికి తగిన ప్రాధాన్యత ఉన్న పాత్రలను ఎంచుకోవాలని నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. పేరు కోసం కాకుండా, కథలో బలం ఉన్న పాత్రలకే ప్రాధాన్యం ఇస్తున్నట్లు సమాచారం. సినిమాలకు దూరంగా ఉన్న సమయంలో కూడా సమీరా రెడ్డి అభిమానులతో టచ్‌లోనే ఉంది. బాడీ పాజిటివిటీ, మాతృత్వం, ఫిట్‌నెస్ వంటి అంశాలపై ఆమె పంచుకున్న వీడియోలు నెటిజన్లను ఆకట్టుకున్నాయి. సెలబ్రిటీ హోదాను పక్కన పెట్టి తన వ్యక్తిగత అనుభవాలను నిజాయితీగా పంచుకోవడంతో ఆమెకు సోషల్ మీడియాలో మంచి ఫాలోయింగ్ ఏర్పడింది. ఇప్పటికే పలువురు సీనియర్ హీరోయిన్లు సెకండ్ ఇన్నింగ్స్‌లో సక్సెస్ సాధిస్తున్న నేపథ్యంలో, సమీరా రీ-ఎంట్రీపై కూడా అంచనాలు పెరిగాయి. ఈ సినిమా ఆమె కెరీర్‌లో ఒక మలుపుగా నిలుస్తుందని భావిస్తున్నారు. అయితే ఆమె నటిస్తున్న ఆ స్టార్ హీరో సినిమా ఏది? అందులో ఆమె పాత్ర ఎలా ఉండబోతోంది? వంటి వివరాలు త్వరలోనే అధికారికంగా వెలువడనున్నాయి. మొత్తానికి, సమీరా రెడ్డి రాకతో టాలీవుడ్‌లో సీనియర్ నటీమణుల హవా మరింత పెరగనుందని అభిమానులు ఆశిస్తున్నారు.




## రామ్ చరణ్ పెద్ది రిలీజ్.. ఆ డేట్‌నే ఫిక్స్ చేశారా?

రామ్ చరణ్ హీరోగా వస్తోన్న రూరల్ స్పోర్ట్స్ డ్రామా పెద్ది. ఈ మూవీకి ఉప్పెన ఫేమ్ బుచ్చిబాబు సనా దర్శకత్వం వహిస్తున్నారు. ఓ ఐటమ్ సాంగ్ మినహా దాదాపు షూటింగ్ అంతా పూర్తయింది. ఇప్పటికే రిలీజ్ కావాల్సిన ఈ మూవీ రెండోసారి కూడా వాయిదా పడింది. ఏప్రిల్ 30న థియేటర్లలోకి రావాల్సిన పెద్దిని జూన్‌కు షిఫ్ట్ చేశారు. అయితే రిలీజ్ తేదీని మాత్రం అఫీషియల్‌గా ప్రకటించలేదు. దీంతో పెద్ది విడుదల తేదీపై నెట్టింట చర్చ మొదలైంది. ఈ మూవీ రిలీజ్ డేట్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. పెద్దిని జూన్ 25న విడుదల చేస్తారని లేటెస్ట్ టాక్. త్వరలోనే దీనిపై అఫీషియల్ అనౌన్స్‌మెంట్ కూడా రానుందన్న వార్త హల్‌చల్ చేస్తోంది. ఈ విషయంపై ఇప్పటి వరకు పెద్ది మేకర్స్ స్పందించలేదు. రాబోయే రోజుల్లో పెద్ది రిలీజ్ డేట్‌పై క్లారిటీ రానుంది. కాగా.. ఈ చిత్రంలో రామ్ చరణ్ సరసన బాలీవుడ్ బ్యూటీ జాన్వీ కపూర్ హీరోయిన్‌గా కనిపించనుంది. ఈ మూవీలోని స్పెషల్ సాంగ్ కోసం శృతి హాసన్‌ను ఎంపిక చేసినట్లు తెలుస్తోంది.

## 'జెట్లీ' ట్రైలర్ విడుదల..

హైదరాబాద్: స్టార్ కమెడియన్‌గా టాలీవుడ్‌లో తనదైన ముద్ర వేసిన సత్య, ఇప్పుడు హీరోగా ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ఆయన ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం 'జెట్లీ'. రితేశ్ రానా దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా ట్రైలర్‌ను తాజాగా విడుదల చేశారు. పూర్తిస్థాయి కామెడీ ఎంటర్‌టైనర్‌గా రూపొందిన ఈ ట్రైలర్, చూసిన వారిని కడుపుబ్బా నవ్విస్తోంది. ట్రైలర్ ఆద్యంతం సత్య తనదైన కామెడీ టైమింగ్‌తో ఆకట్టుకున్నారు. ఇప్పటికే విడుదలైన టీజర్లు, పోస్టర్లు సినిమాపై ఆసక్తిని పెంచగా, ఇప్పుడు ట్రైలర్‌తో అంచనాలు మరింత పెరిగాయి.



## ప్రెగ్నెన్సీలో దీపికా సాహసం.. 'కింగ్' కోసం భారీ యాక్షన్ సీన్స్!

బాలీవుడ్ కింగ్ షారుక్‌ఖాన్, సిద్ధార్థ్ ఆనంద్‌ల క్రేజీ కాంబినేషన్‌లో రాబోతున్న తాజా చిత్రం 'కింగ్'. ఈ సినిమాలో షారుక్‌కు జోడీగా దీపికా పదుకొణె నటిస్తున్న సంగతి తెలిసిందే. అయితే, ఆమె ప్రస్తుతం గర్భవతి కావడంతో ఈ సినిమాలో తన యాక్షన్ సన్నివేశాలకు మేకర్స్ కాస్త విరామం ఇస్తారని అందరూ భావించారు. కానీ, అందరి అంచనాలను తలకిందులు చేస్తూ, దీపికా ఏప్రిల్ 21, 22 తేదీల్లో జరిగిన షూటింగ్ షెడ్యూల్‌లో అత్యంత భారీ పోరాట సన్నివేశాల్లో పాల్గొన్నట్లు సమాచారం. చిత్రబృందం ప్రత్యేకంగా రూపొందించిన సెట్‌లో ఆమె ఎంతో ఉత్సాహంగా ఈ యాక్షన్ సీన్స్‌ను పూర్తి చేసినట్లు తెలుస్తోంది. అంతేకాకుండా, త్వరలోనే సుమారు ఎనిమిది మంది ఫైటర్లతో కూడిన మరో భారీ పోరాట ఘట్టాన్ని ఇసుకలో చిత్రీకరించేందుకు సిద్ధార్థ్ ఆనంద్ ప్రణాళికలు సిద్ధం చేశారు. షారుక్, దీపికా ఇద్దరి కాంబినేషన్‌లో రానున్న ఈ ఇసుక పోరాటం సినిమాకే హైలెట్‌గా నిలవనుందట. ఇక సినిమా వాయిదా పడుతుందేమో అన్న సందేహాలకు తెరదించుతూ, డిసెంబర్ 24న క్రిస్మస్ కానుకగా ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నట్లు మేకర్స్ తాజాగా ఒక ప్రత్యేక వీడియో ద్వారా స్పష్టం చేశారు. దీంతో ఈ ఏడాది చివరలో 'కింగ్' బాక్సాఫీస్ వద్ద సందడి చేయడం ఖాయమని అభిమానులు ఖరారు చేసుకున్నారు.

# తిరుమల శ్రీవారి సేవలో టాలీవుడ్ డైరెక్టర్



టాలీవుడ్ డైరెక్టర్ బాబీ దంపతులు తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఇవాళ ఉదయం వీఐపీ బ్రేక్ దర్శనం సమయంలో స్వామివారికి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతర వీరికి ఆలయ అర్చకులు తీర్థప్రసాదాలు అందజేశారు. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఇక బాబీ సినిమాల విషయానికొస్తే ప్రస్తుతం చిరంజీవితో జతకట్టారు. వాల్తేరు వీరయ్య హిట్ తర్వాత మరోసారి ఈ కాంబో రిపీట్ కానుంది. బాబీతో 'మెగా 158' వర్కింగ్ టైటిల్‌తో తెరకెక్కించనున్న చిత్రం వచ్చే నెలలో సెట్స్‌పైకి వెళ్లనుంది. ఈ భారీ ప్రాజెక్ట్‌కు సంబంధించిన టైటిల్ కాకాజీ అని ఫిక్స్ చేశారని టాక్ వినిపిస్తోంది. దీనిపై ఇంకా అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.

# రాజశేఖర్ చేయాల్సిన 'ఠాగూర్'.. అలా చిరంజీవి చేతుల్లోకి



'ఠాగూర్' పేరు చెప్పగానే మెగాస్టార్ చిరంజీవి గుర్తొస్తారు. ఇందులో ఆయన చెప్పిన డైలాగ్స్, అద్భుతమైన యాక్టింగ్ మరోసారి మదిలో మెదులుతాయి. చెప్పాలంటే చిరు కెరీర్‌లోనే మైలురాయి లాంటి సినిమా ఇది. అయితే ఇదో రీమేక్ అని చాలామందికి తెలీదు. అలానే రాజశేఖర్ చేయాల్సిన ఈ మూవీ.. చిరంజీవి చేతుల్లోకి వచ్చిందనే సంగతి కూడా ఇప్పటి జనరేషన్‌లో చాలామందికి తెలిసి ఉండకపోవచ్చు. ఇప్పుడీ విషయంపై స్వయంగా రాజశేఖర్ స్పందించారు. అప్పట్లో ఏం జరిగిందో బయటపెట్టారు. ''ఠాగూర్' నేను కొనుక్కున్న సినిమా. అడ్వాన్స్ అంతా ఇచ్చేశా. నిర్మాత నా ఫ్రెండే కదా అని ?అగ్రిమెంట్ చేసుకోలేదు. ఠాగూర్ మధు ఉన్నారు కదా! చిరంజీవి కోసం ఆయన వెళ్లి, ప్రొడ్యూసర్‌ని కలిసి ఎక్కువ డబ్బులిస్తానని చెప్పి పట్టుకెళ్లిపోయారు. నేను అగ్రిమెంట్ చేయలేదు కాబట్టి నాకు ఇవ్వలేదు. ఇది జరిగింది' అని రాజశేఖర్ అప్పటి సంగతులు గుర్తుచేసుకున్నారు. శంకర్ దర్శకత్వంలో అర్జున్ చేసిన 'జెంటిల్మన్' సినిమా కూడా తానే చేయాలని.. కానీ 'అల్లరి ప్రియుడు' షూటింగ్ టైంలోనే ఆ అవకాశం రావడంతో తప్పక వదులుకున్నానని రాజశేఖర్ చెప్పారు. దీనిబట్టి అర్థమైంది ఏంటంటే.. సినిమా ఇండస్ట్రీలో తెర వెనక చాలా జరుగుతుంటాయి. కాకపోతే అప్పుడు సోషల్ మీడియా లాంటివి లేకపోవడం నిజాలు బయటకు రాలేదు. ఇప్పుడు ఈయనే చెప్పడంతో జరిగింది ఇది అని అందరికీ క్లారిటీ వచ్చింది. తమిళంలో విజయకాంత్ హీరోగా ఏఆర్ మురగదాస్ దర్శకత్వంలో 'రమణ' సినిమా వచ్చింది. ఇది బ్లాక్‌బస్టర్ కాగా తెలుగులో దీన్నే 'ఠాగూర్'గా రీమేక్ చేశారు. వివి వినాయక్ దర్శకత్వం వహించారు. ఇక్కడ కూడా అద్భుతమైన ఆదరణ దక్కించుకుంది. సూపర్‌హిట్‌గా నిలిచింది. ఒకవేళ ఇది రాజశేఖర్ చేసుంటే ఎలా ఉండేదో మరి?

Printed and Published by V. Srinivas Reddy on behalf of M/s Sai Krishna Publications, Owned by M/s Sai Krishna Publications Printed at Sree Seshasai Enterprises, Plot No. 98/1, Co-operative Industrial Estate, IDA, Gandhinagar, Quthbullapur Mandal, Medchal-Malkajgiri Dist, Telangana. Published at Plot No. 3, Flat No.13, Surya Saroj Apartments, HUDA Complex, Saroornagar Ranga Reddy District.(Hyd) - 500 035, Telangana. Editor : V. SRINIVAS REDDY, cell:9440231967 RNI No. APTEL/2010/36516, prajajyothiadilabad@gmail.com